


చిలకలూరిపేట మేజర్ కాలువ ప్రాంతం విస్తరణ

మహా ఏర్పాట్లు

- తిరునాళ్లకు శరవేగంగా పనులు
- ఉచిత, శీఘ్ర, ప్రత్యేక దర్శనాలకు క్యూలు
- కోటప్పకొండలో రేపటి నుంచి ఉత్సవాలు ప్రారంభం
- కోటయ్య స్వామికి విశేష అభిషేకాలు..
- తరలిరానున్న భక్తులు



కోటప్పకొండ(నరసరావుపేట), ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి పండుగ సందర్భంగా ప్రముఖ శైవక్షేత్రం కోటప్ప కొండ శ్రీత్రికోటేశ్వరస్వామి సన్నిధిలో 26న బుధవారం జరిగే తిరునాళ్లకు విస్తృత ఏర్పాట్లు జరుగుతున్నాయి. కోటయ్య క్షేత్రం లో పనులు శరవేగంగా జరుగుతున్నాయి. దేశ ప్రసిద్ధి చెందిన తిరునాళ్లకు లక్షలాదిగా తరలివచ్చే భక్తుల కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తున్నారు. శ్రీత్రికోటేశ్వరస్వామి దర్శనం కోసం ఉచిత, శీఘ్ర, ప్రత్యేక దర్శనాలకు క్యూలు ఏర్పాటు చేశారు. వీఐపీలు, ప్రొటోకాల్ వీఐపీల కోసం వేర్వేరుగా క్యూలు ఏర్పాటు చేస్తున్నారు. క్యూలను తాటాకు పందిళ్లతో నిర్మిస్తున్నారు. తిరునాళ్లకు వచ్చే భక్తుల కోసం స్వామి వారి ప్రసాదాన్ని సిద్ధం చేస్తున్నారు. రెండు లక్షల లడ్లు, లక్ష అరిసెలను భక్తులకు అందుబాటులో ఉంచనున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలో తాగునీటి సరఫరా, తాత్కాలిక మరుగుదొడ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఆర్‌అండ్‌బీ, విద్యుత్ విభాగం ఆధ్వర్యంలో కొండ ప్రాంతం వద్ద ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు చేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లను, జనరేటర్లను ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా విద్యుత్ శాఖ ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటున్నది. భక్తులు తలనీలాలు సమర్పించేందుకు కొండ దిగువన ఏర్పాట్లు చేస్తున్నారు. చిలకలూరిపేట మేజర్ వద్ద స్నాన ఘట్టాలను ఏర్పాటు చేస్తున్నారు. పాత కోటేశ్వరస్వామి దేవాలయం వద్ద విద్యుత్ ఏర్పాట్లు జరుగుతున్నాయి. దేవస్థానం వద్ద ఏర్పాట్లను ఈవో చంద్రశేఖరరావు పర్యవేక్షిస్తున్నారు. భక్తులు పర్యాటక కేంద్రాన్ని సందర్శించేలా అటవీశాఖ ఏర్పాట్లు చేస్తున్నది. ఆనందం, ఆహ్లాదం కోసం కొండ దిగువన ఎమ్యూజ్‌మెంట్ పార్కు రూపుదిద్దుకుంటున్నది. వైద్య ఆరోగ్య శాఖ వైద్య శిబిరాల ఏర్పాట్లలో నిమగ్నమైంది. పోలీసు అధికారులు బందోబస్తుకు అవసరమైన చర్యలు తీసుకుంటు న్నారు. వాహనాల రాకపోక లకు ఇబ్బంది లేకుండా చిలక లూరిపేట మేజర్ కాల్వ, నరసరావుపేట రహదారి మధ్యలో ఉన్న ప్రాం తా న్ని విస్తరించారు. ఆయా పనులను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు శనివారం పరిశీలించారు.

రేపు ఏకాదశికి ప్రత్యేక ఏర్పాట్లు

త్రికోటేశ్వరస్వామి తిరునాళ్ల ఉత్సవాలు సోమవారం ఏకాదశి నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా దేవస్థానంలో కోటయ్యస్వామికి విశేష అభిషేకాలు నిర్వహించనున్నారు. వేలాదిగా కొండకు భక్తులు తరలిరానున్నారు. మూలవిరాట్ అభిషేకాలకు భక్తులను అనుమతించడంలేదు. అభిషేక మండపంలో స్వామికి అభిషేకాలు చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ అభిషేకాలకు రూ.500 టికెట్‌పై ఇద్దరిని అనుమతిస్తారు.


దేవస్థానం వద్ద క్యూల నిర్మాణం


లడ్డూ ప్రసాదం తయారీ

తిరునాళ్లకు 550 ఆర్టీసీ సర్వీసులు

తిరునాళ్ల రోజున నరసరావుపేట, చిలకలూరిపేట డిపోల నుంచి ప్రత్యేకంగా బస్సులను ఆర్టీసీ ఏర్పాటు చేసింది. చిలకలూరిపేట రోడ్డులో ఘాట్ రోడ్డు పక్కన తాత్కాలిక బస్టాండ్ పనులను ఆర్టీసీ నిర్వహిస్తున్నది. నరసరావుపేట బస్టాండ్, చిత్రాలయ సెంటర్ నుంచి తిరునాళ్ల బస్సులను ఆర్టీసీ ఏర్పాటు చేస్తోంది. తిరునాళ్లకు ప్రత్యేకంగా 550 బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. నరసరావుపేట నుంచి 280, చిలకలూరిపేట 100, అద్దంకి 35, ఒంగోలు 45, చీరాల 45, వినుకొండ నుంచి 45 బస్సులు ఏర్పాటు చేస్తున్నారు. ఘాట్ రోడ్డులో కొండ దిగువ నుంచి ఎగువకు భక్తుల కోసం తిరుమల నుంచి వచ్చిన 85 శేషాద్రి బస్సులు ఏర్పాటు చేస్తున్నారు. నరసరావుపేట నుంచి కొండ దిగువకు టిక్కెట్ రూ.30, కొండ దిగువ నుంచి కొండపైకి టిక్కెట్ రూ.25, చిలకలూరిపేట నుంచి రూ.30, వినుకొండ రూ.60, ఒంగోలు రూ.120, చీరాల రూ.100, అద్దంకి నుంచి రూ.105 టికెట్ ధరగా నిర్ణయించినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు చెప్పారు.


కొండ దిగువున తాత్కాలిక ఆర్టీసీ బస్టాండ్ పనులు

సమష్టిగా విజయవంతం చేయాలి

- తిరునాళ్ల ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ


నరసరావుపేట రూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): సమష్టిగా కృషి చేసి సమన్వయంతో కోటప్పకొండ తిరునాళ్లను విజయవంతం చేయాలని అధికారులకు కలెక్టర్ అరుణ్‌బాబు సూచించారు. కోటప్పకొండ తిరునాళ్లపై శనివారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో సమీక్షించారు. మహాశివరాత్రి ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రభల తరలింపునకు అంతరాయం కలగకుండా రోడ్లను తీర్చిదిద్దాలన్నారు. ప్రభల రాకపోకలకు కరెంటు వైర్లు తగలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుధ్యం, తాగునీటి సౌకర్యాలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. క్యూలో భక్తులకు తాగునీటి ప్యాకెట్లు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో ఆర్డీవో మధులత, రోడ్లు భవనాల శాఖ అధికారి రాజానాయక్, డీపీవో భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎస్పీ కంచి శ్రీనివాస్‌తో కలిసి కోటప్పకొండ వద్ద ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు.


కోటప్పకొండలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

సాగర్‌లో.. వారబందీ

9 రోజులు సరఫరా..
6 రోజులు నిలిపివేత

- ఆయకట్టు పరిధిలో 87 వేల ఎకరాల్లో వరి సాగు


సాగర్ కుడి కాలువ

నరసరావుపేట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ కుడి కాల్వ ఆయకట్టులో వారబందీ విధానాన్ని జలవనరుల శాఖ అమలు చేస్తోంది. జలాశయంలో నీటి నిల్వలు తగ్గిన నేపథ్యంలో జలవనరుల శాఖ ఈ నిర్ణయం తీసుకుంది. 9 రోజుల పాటు నీటి సరఫరా ఉంటుంది. తదుపరి ఆరు రోజులు నిలిపివేస్తారు. రైతులు రబీలో కూడా పెద్దఎత్తున వరి సాగు చేశారు. వారబందీ అమలుపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంటలకు మార్చి 31 వరకు వారబందీ విధానంలో నీటి సరఫరా చేయనున్నారు. ఈ నెల 28 వరకు నీటి సరఫరా చేస్తారు. తదుపరి ఆరు రోజులు నీటి సరఫరాను నిలిపివేస్తారు. రానున్న వేసవికి తాగుకు కూడా నీటిని కేటాయించాల్సి ఉంది. ఆయకట్టు పరిధిలోని పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో వరి సాధారణ విస్తీర్ణం 1,05,695 ఎకరాలు కాగా 86,730 ఎకరాల్లో సాగు చేశారు. మిరపకు మార్చి నెలాఖరు వరకు సాగు నీరు అవసరం ఉంటుందని రైతులు తెలిపారు. ఏప్రిల్‌లో రెండు వారాల పాటు వరికి నీరు అవసరం ఉంటుందని రైతులు చెబుతున్నారు.

సాగర్‌లో 177.26 టీఎంసీల నీటి నిల్వ

నాగార్జున సాగర్‌లో 312.05 టీఎంసీలు పూర్తి నిల్వ సామర్థ్యం కాగా 177.26 టీఎంసీల నీటి నిల్వ ఉంది జలాశయం నీటి మట్టం 590 అడుగులు కాగా గురువారం 234.60 అడుగులు నీటి మట్టం నమోదైంది. మిర్చికి మార్చి 31 వరకు, వరికి ఏప్రిల్ నెలాఖరు వరకు సాగు నీరు అవసరం ఉందని అప్పటి వరకు సాగు నీరు సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు.


పీవోల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, జేసీ


ప్రక్రియపై అవగాహన ఉండాలి

ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి నాగలక్ష్మి

గుంటూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా - గుంటూరు పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ ప్రిసైడింగ్ అధికారులు పోలింగ్‌కు సంబంధించి ఎన్నికల సంఘం నిర్దేశించిన అన్ని ప్రక్రియలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. ఎన్నికలకు సంబంధించి ప్రిసైడింగ్, సెక్టార్ అధికారులకు శనివారం కలెక్టరేట్లోని ఎస్ఆర్ శంకరన్ హాల్లో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. పోలింగ్ రోజు ఉదయం 8 గంటలకి ఓటింగ్ ప్రారంభించేలా పోలింగ్ కేంద్రాల వద్ద అభ్యర్థుల వివరాలు, ఇతర పోస్టర్లు ప్రదర్శించాలన్నారు. అభ్యర్థుల ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్ బాక్సులను పోలింగ్‌కు సిద్ధం చేయాలన్నారు. టెండర్ ఓటు, ఛాలెంజ్ ఓటు ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలన్నారు. పోలింగ్ సమ యం ముగిసేసరికి కేంద్రం గేట్లు మూసేసి లోపల క్యూలో ఉన్న వారికి స్లిప్పులిచ్చి ఓటు వేసేందుకు అవకాశం కల్పించాలన్నారు. సమావేశంలో జేసీ భార్గవ్ తేజ, డీఆర్వో ఖాజావలి తదితరులు పాల్గొన్నారు.

2015 రిపీటయ్యేనా?

- మండలి ఎన్నికల్లో విజయం కోసం టీడీపీ
- అప్పటి వరకు రెండుసార్లు టీచర్స్ ఎమ్మెల్సీగా లక్ష్మణరావు ఎన్నిక
- మూడోసారి ఆయన గెలుపునకు నాటి అధికార టీడీపీ బ్రేక్
- ఇప్పుడు పట్టభద్రుల ఎన్నికల్లోనూ అదేవ్యూహంతో అడుగులు



గుంటూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): కృష్ణా - గుంటూరు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ 2015లో ఎన్నికల్లో సాధించిన ఘన విజయాన్ని ఈ దఫా పట్టభద్రుల నియోజకవర్గంలో రిపీట్ చేసేందుకు టీడీపీ అన్ని ప్రయత్నాలు చేస్తున్నది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ ఆదేశానుసారం ఆరు జిల్లాల నేతలు సమష్టిగా పార్టీకి తిరుగులేని మెజార్టీతో విజయాన్ని అందించేందుకు కృషి చేస్తున్నారు. మం త్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సీనియర్ నేతలు నియోజకవర్గాల వారీగా బాధ్యత తీసుకుని పట్టభద్రులను ఆకర్షిస్తున్నారు. 2007లో శాసనమండలి పునరుద్ధరణ జరిగినప్పుడు ఉమ్మడి కృష్ణా - గుంటూరు జిల్లాల టీచర్స్ ఎమ్మెల్సీ నియోజకవర్గం నుంచి లక్ష్మణరావు గెలుపొందారు. అనంతరం జరిగిన లాటరీలో ఆయన పదవీ కాలం స్వల్ప వ్యవధిలోనే ముగిసింది. దాంతో 2009లో జరిగిన ఎన్నికల్లో రెండో సారి ఆయన టీచర్స్ ఎమ్మెల్సీగా గెలుపొందారు. 2015లో మరోసారి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు రాగా వివిధ వర్గాలు ఎమ్మెల్సీ లక్ష్మణరావుకు తిరుగేలేదని, ఆయన హ్యాట్రిక్ కొట్టడం ఖాయమని భావించాయి. అయితే ఆ సందర్భంలో టీడీపీ అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు కాగా ఆ ఎన్నికని సీఎం చంద్రబాబు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. దాంతో ఆ ఎన్నికల్లో తొలి ప్రాధాన్య ఓట్ల లెక్కింపులోనే ఏఎస్ రామకృష్ణ గెలుపొందారు.

కాగా ఇప్పుడు జరగబోతున్న పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నిక సమయంలోనూ టీడీపీ బలపరిచిన కూటమి అధికారంలో ఉండటం.. సీఎంగా చంద్రబాబు ఉన్నారు. దీంతో టీడీపీ, జనసేన, బీజేపీ క్యాడర్ అంతా రంగంలోకి దిగింది. ప్రచార పరంగా మిగతా అభ్యర్థుల కంటే ఆలపాటి చాలా ముందున్నారు. ఈ విధంగా 2015 టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏ విధంగా అయితే టీడీపీ అభ్యర్థి గెలుపొందారో అదే రీతిన ఇప్పుడు ఆలపాటి గెలుపు కోసం ప్రతీ ఒక్క నాయకుడు, కార్యకర్త శ్రమిస్తున్నారు.



నాడు అధ్వానం.. నేడు అద్దంలా

రెంటచింతల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రోడ్లను పట్టించుకోలేదు. దీంతో పాదచారులు, వాహన చోదకులు రోడ్డుపైకి రావాలంటేనే భయపడాల్సి వచ్చింది. గోతుల రోడ్లతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నా నాటి పాలకులు పట్టించు కోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రహదారులపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఈ క్రమంలో గతంలో అధ్వానంగా ఉన్న రోడ్లు ప్రస్తుతం అద్దంలా మెరిసిపోతున్నాయి. మంచికల్లులోని ప్రధాన రహదారి ఈ కోవలో చేరింది. ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి ప్రత్యేక చొరవతో రహదారుల నిర్మాణం నిమిత్తం సీఐఆర్ఎఫ్ పథకం కింద మాచర్లకు 117.70 కోట్లు విడుదలయ్యాయి. గేట్ నుంచి మంచికల్లు వరకు మరమ్మతులకు ఒక విడత రూ.35 లక్షలు, మరో విడత 15 లక్షలు కేటాయించారు. దీంతో రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. రోడ్డు పనులు పూర్తి చేసినట్లు ఆర్‌అండ్ బీ ఏఈఈ యూసఫ్ చెప్పారు. ఇతర గ్రామాలకు వెళ్లే రహదారుల మరమ్మతులు పూర్తయ్యాయన్నారు. వీటిలో సత్రశాల రహదారి ఒకటన్నారు.



2 సత్రాలు, 19 ఆలయాల పునర్విభజన

- ఆలయాల బడ్జెట్ పల్నాడు జిల్లా అధికారికి అప్పగింత
- జీవో 268 అనుసరించి దేవదాయ ఇన్‌చార్జి కమిషనర్ ఉత్తర్వులు

గుంటూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండు సత్రాలు, 19 ఆలయాలను పునర్విభజన చేస్తూ దేవదాయశాఖ ఇన్‌చార్జి కమిషనర్ రామచంద్రమోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో జారీ చేసిన జీవో 268 అనుసరించి పల్నాడు జిల్లా దేవదాయ శాఖ అధికారి పంపిన నివేదిక ఆధారంగా పునర్విభజన చేశారు. గతంలో ఈ ఆలయాలు 6(బీ)గా ఉండేవి. ఇప్పుడు ఆయా ఆలయాలను 6(సీ)గా మార్చారు. అప్పట్లో ఈ ఆలయాలకు సంబం . ధించి పర్యవేక్షణ బాధ్యతలు, బడ్జెట్ మంజూరు, విత్ డ్రాయల్స్ తదితర అంశాలు ఈవో నివేదిక మేరకు గుంటూరు డిప్యూటీ కమిషనర్ పర్యవేక్షణలో జరిగేవి. ఇప్పుడు ఆ బాధ్యతలను పల్నాడు జిల్లా దేవదాయ శాఖ అధికారికి బదిలీ చేశారు. ఇకనుంచి ఆయా ఆలయాల్లో పర్యవేక్షణ బాధ్యతలను పల్నాడు జిల్లా దేవదాయశాఖ అధికారికి అప్పగించారు.

సత్రాలు: పిడుగురాళ్లలోని శ్రీఅరవపల్లి బాపన ధర్మసత్రం, మాచవరం మండలం పిల్లుట్ల గ్రామంలోని శ్రీగుర్రం వీరారెడ్డి గోపాలకృష్ణారెడ్డి ఆర్ఫన్స్ ఎస్టేట్

ఆలయాలు: రెంటచింతల మండలం జెట్టిపాలేనికి చెందిన సత్రశాల మల్లేశ్వరస్వామి ఆలయం, రెంటచింతల శ్రీమల్లేశ్వరస్వామిదేవస్థానం, గురజాలలోని శ్రీపాతపాటమ్మ ఆలయం, సత్తెనపల్లి మండలం భృగుబండలోని శ్రీజగన్నాథస్వామి ఆలయం, సత్తెనపల్లిలోని వేణుగోపాలస్వామి దేవస్థా నం, యడ్లపాడు మండలం చంఘీజ్ ఖాన్‌పేటలోని వెన్నముద్దల వేణుగోపాల స్వామి ఆలయం, నరసరావుపేటలోని శ్రీ గంగమ్మ - అంకమ్మ ఆలయం, నాదెండ్లలోని శ్రీనడికుంట విఘ్నేశ్వరస్వామి ఆలయం, శ్రీ గోవర్ధనస్వామి దేవస్థానం, బొల్లాపల్లి మండలం రావులపురంలోని మన్నేపల్లి లక్ష్మీనరసింహస్వామి ఆలయం, నకరికల్లులోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం, బెల్లంకొండలోని శ్రీ గాయత్రి పంచాయతన ఆశ్రమం, మల్లేశ్వరస్వామి ఆలయం, కేతవరంలోని లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం. అమరావతి మండలం మల్లాది గ్రామంలో శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం, కర్లపూడిలోని శ్రీవేణుగోపాల, ఆంజనేయ స్వామి దేవస్థానం, పెదకూరపాడు మండలం లగడపాడులోని శ్రీమల్లికార్జునస్వామి దేవస్థానం, మాచవరం మండలం మోర్జంపాడులోని శ్రీనీలకంఠేశ్వరస్వామి ఆలయాలను పునర్విభజన కింద6(సీ)గా మార్చారు.

బాల కార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా ఉద్యమించాలి



పద్మశ్రీ శాంతా సిన్హాను సత్కరిస్తున్న ఎస్‌ఆర్‌ఎం ప్రతినిధులు

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా వేళ్లూనుకున్న బాల కార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని జాతీయ బాలల హక్కుల రక్షణ కమిషన్ మాజీ చైర్‌పర్సన్, పద్మశ్రీ డాక్టర్ శాంతా సిన్హా పిలుపునిచ్చారు. 'చదువుతోనే బాల కార్మిక వ్యవస్థకు విమోచన' పేరిట మంగళగిరిలోని ఏపీ ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీలో శనివారం చర్చాగోష్ఠి నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన శాంతా సిన్హా ఉద్యోగులు, విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. గడిచిన 30 ఏళ్లుగా బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ఎంవీ ఫౌండేషన్ ద్వారా చేస్తున్న పోరాటాలను వివరించారు. నిరక్షరాస్యత, పేదరికం వల్లనే బాల కార్మికులు గణనీయంగా పెరుగుతున్నారని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమగ్రమైన చట్టాలను తీసుకువచ్చి, రాత్రి బడులు నిర్వహించడం, బ్రిడ్జి కోర్సుల సెంటర్లు ఏర్పాటు చేయడం వంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఇందుకోసం బడ్జెట్‌లో నిధులు కేటాయించి బాల కార్మిక రహిత సమాజ స్థాపనకు నడుం బిగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్‌ఆర్‌ఎం వైస్‌చాన్స్‌లర్ ఆచార్య మనోజ్‌కుమార్ అరోరా, రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.ప్రేమ్‌కుమార్, డీన్ విష్ణు పథ్, డాక్టర్ సీవీ టామీ, రీసెర్చ్ డీన్ డాక్టర్ రంజిత్ థాపా పాల్గొన్నారు.

24, 25 తేదీల్లో ప్రత్యేక రైళ్లు

గుంటూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఈ నెల 24, 25 తేదీల్లో గుంటూరు మీదుగా ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు. 07753 చర్లపల్లి - దానాపూర్ ఈ నెల 24న, నంబరు. 07755 చర్లపల్లి - దానాపూర్ రైలు ఈ నెల 25న ఉదయం 9.30 గంటలకు బయలుదేరి పిడుగురాళ్ల, గుంటూరు, విజయవాడ, ఏలూరు మార్గంలో ప్రయాణించి రెండో రోజు వేకువజామునకు ముందు 2 గంటలకు దానాపూర్ చేరుకొంటాయి. నంబరు. 07754 దానాపూర్ - చర్లపల్లి రైలు ఈ నెల 24న, నంబరు. 07756 దానాపూర్ - చర్లపల్లి రైలు ఈ నెల 25న మధ్యాహ్నం 3.30 గంటలకు బయలుదేరి గుంటూరు, పిడుగురాళ్ల మీదుగా రెండో రోజు ఉదయం 8.15 గంటలకు చర్లపల్లి చేరుకొంటాయి. వీటికి అడ్వాన్స్ రిజర్వేషన్ ఈ నెల 23 ఉదయం 8 గంటలకు ప్రారంభమౌతుందని సీపీఆర్‌వో తెలిపారు.

సీఏ విద్యార్థులకు ఉపాధి కల్పించడమే లక్ష్యం

- నూతన రాజధాని అమరావతిలో ఐసీఏఐ ఎక్సలెన్స్ సెంటర్
- ఐసీఏఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రసన్నకుమార్



ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన ఐసీఏఐ నూతన కార్యవర్గ సభ్యులు

గుంటూరు (విద్య), ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): సీఏ విద్యార్థుల భవిష్యత్తు కోసం వారికి ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) గుంటూరు బ్రాంచి కృషి చేయాలని ఐసీఏఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.ప్రసన్నకుమార్ విజ్ఞప్తి చేశారు. శనివారం స్థానిక అమరావతి రోడ్డులో ఉన్న బండ్లమూడి గార్డెన్స్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రసన్నకుమార్ మాట్లాడుతూ విద్యార్థుల కోసం నూతన భవనం నిర్మించాలని సూచించారు. చార్టెడ్ అకౌంటెంట్స్‌ల భవిష్యత్తుకు ఉపయోగపడేలా మంచి ప్రణాళిక రచిస్తామన్నారు. ఐసీఏఐ న్యూ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అమరావతి సెంటర్‌ను ప్రకటించారు. రానున్న సంవత్సరానికి సమగ్ర కార్యాచరణను రూపొందించుకొని గుంటూరు బ్రాంచిను జాతీయస్థాయిలో ఉత్తమ స్థానాన్ని పొందాలని ఆకాంక్షించారు. గుంటూరు బ్రాంచి చైర్మన్ చింతా వీఎన్ఎస్ రఘునందన్ మాట్లాడుతూ బ్రాంచి అభివృద్ధికి, సీఏ మెంబర్స్, సీఏ విద్యార్థులు, వర్తక సంఘాలు, ప్రభుత్వ రంగ సంస్థల మధ్య గుంటూరు బ్రాంచి ఒక వారధిలా పని చేసేలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సెక్రటరీ వనిమిరెడ్డి వెంకట నరేష్ , వైస్ చైర్మన్ రుద్రవరపు భరద్వాజ ట్రెజరర్ కన్నెగంటి మృత్యుంజయరావు, సికాసా చైర్మన్ సీఏ రాజశేఖర్, కమిటీ సభ్యులు బాజీ షేక్, దేసు సంపత్ , మాజీ చైర్మన్ నూతలపాటి అమర్నాథ్, సెంట్రల్ కౌన్సిల్ మెంబర్ ముప్పాళ్ల శ్రీధర్, ముప్పాళ్ల సుబ్బారావు, ఎస్ఐఆర్‌సీ సెక్రటరీ, ఎక్స్ అఫిషియో ఆఫ్ గుంటూరు ఎర్ర తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

యువకుడు ఆత్మహత్య

బెల్లంకొండ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఉరి వేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని మన్నెసుల్తాన్‌పాలెం పంచాయతీ పరిధిలోని రామాంజనేయపురం గ్రామంలో శనివారం తెల్లవారుజామున జరిగింది. ఈ సంఘటనలో రామాంజనేయపురం గ్రామానికి చెందిన రామావత్ తార్యానాయక్(30) మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం మృతుడు తార్యా నాయక్ పల్నాడు జిల్లా నాగార్జున సాగర్ సమీపంలోని చిన్న పల్లెటూర్‌లో విజయాబాయి అనే మహిళను వివాహం చేసుకున్నాడు. వారికి ఇద్దరు సంతానం. కొద్దిరోజుల క్రితం భార్య భర్తల మధ్య మనస్పర్ధలు రావటంతో భార్య పుట్టింటికి వెళ్లి పోయింది. కాపు రానికి రావడంలేదని తీవ్ర ఆవేదనకు గురై ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్టు గ్రామస్తులు తెలిపారు. ఎస్ఐ ప్రవీణ్ కుమార్ సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహానికి శవ పంచనామా నిర్వహించి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రకృతి వైద్యులను నియమించాలి

- మాజీ వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి కామినేని శ్రీనివాస్



విద్యార్థులతో మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్, కళాశాల పాలకవర్గం

పిట్టలవానిపాలెం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రతి జిల్లాలో ప్రభుత్వ వైద్యశాలలో తప్పనిసరిగా యోగా నేచరోపతి ప్రకృతి వైద్యులను నియమించే విధంగా వచ్చే అసెంబ్లీ సమావేశాలలో మాట్లాడుతానని కైకలూరు శాసన సభ్యుడు, మాజీ వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రమైన పిట్టలవానిపాలెం కేర్‌యోగా ప్రకృతి మెడికల్ కళాశాలలో 2018-2019 సంవత్సరానికి డిగ్రీ డాక్టరేట్ పట్టా పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదాన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పట్టా పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్‌లను అందజేశారు. కార్యక్రమానికి ఆర్‌కే ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు వేగేశన రాధాకృష్ణ అధ్యక్షత వహించి మాట్లాడుతూ రానున్న సంవత్సరకాలంలో డిగ్రీ రాస్తున్న కేర్ యోగా నేచరోపతి ప్రకృతి మెడికల్ కళాశాలలో తీరప్రాంత విద్యార్థులకు పీజీ కోర్సులు కూడా ప్రారంభించటానికి ప్రయత్నం చేస్తున్నామన్నారు. ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ సీఎల్‌వీరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో సైతం ఇలాంటి వైద్యశాలలను ఏర్పాటు చేయడం సంతోషదాయకమన్నారు డాక్టరేట్ పొందిన కేర్ హైస్కూల్ ప్రిన్సిపాల్ రమణమూర్తిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వి.వసంతలక్ష్మి, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ మహేష్ పండిట్, కళాశాల సెక్రటరీ కిషోర్‌కుమార్, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం శనివారం నాటికి 534.00 అడుగులు ఉంది. ఇది 176.05 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 8067 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8896 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 15,662 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2000, ఎల్ఎల్‌సీ ద్వారా 280 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 34,905 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

నేడు గ్రూపు-2 మెయిన్స్ పరీక్ష

గుంటూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీసు కమిషన్ గ్రూపు-2 మెయిన్స్ పరీక్ష ఆదివారం జరుగుతుంది. జిల్లాలో మొత్తం 11 పరీక్ష కేంద్రాల్లో 9,277 మంది అభ్యర్థులు పరీక్ష రాయబోతున్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్-1, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటలకు వరకు పేపర్-2 పరీక్ష జరుగుతుంది. ఇందుకోసం ఏపీపీఎస్‌సీ నుంచి అన్ని పరీక్ష కేంద్రాలకు చీఫ్ సూపరింటెండెంట్‌లు, ఇతర సిబ్బంది వచ్చారు. అలానే జిల్లా నుంచి లైజాన్ అధికారులను కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి నియమించారు. అభ్యర్థుల కోసం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూంని ఏర్పాటు చేశారు. నంబరు. 08632234070కు ఫోన్ చేసి సమాచారం తెలుసుకోవచ్చని జిల్లా రెవెన్యూ అధికారి ఎస్ షేక్ ఖాజావలి తెలిపారు. పరీక్ష కేంద్రాలలోకి అభ్యర్థులను ఉదయం 8.30 గంటల నుంచి 9.30 గంటల వరకు, గ్రేస్ పీరియడ్ 15 నిమిషాలు కలిపి 9.45 వరకు అనుమతిస్తామన్నారు. అలానే మధ్యాహ్నం 1.30 గంటల నుంచి 2.30 గంటల వరకు గ్రేస్ పీరియడ్ 15 నిమిషాలు కలిపి 2.45 వరకు అనుమతిస్తారని తెలిపారు. అభ్యర్థులు హాల్‌టిక్కెట్‌తో పాటుగా ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా ఒరిజినల్ గుర్తింపు కార్డుని వెంట తెచ్చుకోవాలన్నారు. మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లు వంటివి లోనికి అనుమతించబోమన్నారు. అలానే పరీక్ష కేంద్రాలకు దగ్గరలో జిరాక్స్, నెట్ సెంటర్లను మూసేయిస్తామన్నారు.

పరీక్ష జరిగే కేంద్రాలు ఇవే...

మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజనీరింగ్ కళాశాల(పుల్లడిగుంట), విజ్ఞాన్ యూనివర్శిటీ(వడ్లమూడి), చలపతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ(లాం), కేకేఆర్ అండ్ కేఎస్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాల (వింజనంపాడు), విజ్ఞాన్ డిగ్రీ కళాశాల (పెదపలకలూరు రోడ్డు), విజ్ఞాన్ నిరుల ఇంజనీరింగ్ కళాశాల (పెదపలకలూరు రోడ్డు), ఎస్‌ఆర్ఐ ఇంజనీరింగ్ కళాశాల (విశదల, పేరేచర్ల), ఆంధ్ర క్రైస్తవ కళాశాల (సాంబశివపేట, గుంటూరు), జీవీఆర్ అండ్ ఎస్ ఇంజనీరింగ్ కళాశాల (బుడంపాడు), ఆర్‌వీఆర్ అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాల (చౌడవరం), ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాల(పుల్లడిగుంట).

బడ్జెట్‌లో నీటి ప్రాజెక్టులకు 10 శాతం కేటాయించాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



మాట్లాడుతున్న రామకృష్ణ, పాల్గొన్న ముప్పాళ్ల నాగేశ్వరరావు, జంగాల

గుంటూరు (తూర్పు), ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 24 నుంచి జరగనున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలో సుమారు మూడు లక్షల కోట్ల బడ్జెట్ ప్రవేశపెట్టనుందని ప్రచారం జరుగుతుందనీ, అయితే ఈ బడ్జెట్ అప్పులపై ఆధారపడే బడ్జెట్ కాకూడదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. గుంటూరు మల్లయ్య లింగం భవన్లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారీ బడ్జెట్ ప్రవేశపెట్టాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఉందనీ, అసలు రాష్ట్రానికి అంత ఆదాయం వస్తుందా అనే విషయాన్ని ఆలోచించాలని సూచించారు. జగన్ ఏ తప్పులు అయితే చేశాడని ఆనాడు విమర్శలు చేశామో ప్రస్తుతం చంద్రబాబు కూడా అదే తప్పులు చేస్తున్నారని అన్నారు. ఇరిగేషన్ ప్రాజెక్టులకు బడ్జెట్లో ప్రాధాన్యత ఇవ్వాలనీ, 10 శాతం నిధులు కేటాయించాలని కోరారు. ఎన్టీఆర్ హయాంలో ప్రారంభించిన హంద్రీనీవా, వెలుగొండ తదితర ప్రాజెక్టులు 30 సంవత్సరాలు గడిచినా నేటికీ పూర్తి కాలేదన్నారు. సూపర్ సిక్స్ అమలుకు నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వ ఆర్థిక విధానాలను వ్యతిరేకిస్తూ మార్చి 23 నుంచి ఏప్రిల్ 14 వరకు సీపీఐ ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమాలను దేశవ్యాప్తంగా చేపట్టనున్నట్టు తెలిపారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ అగ్రిగోల్డ్ బాధితులకు సత్వరమే న్యాయం చేయాలని కోరుతూ ఈ నెల 24న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కలెక్టర్ కార్యాలయాల్లో అర్జీలు అందజేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో జంగాల అజయ్‌కుమార్, కోటా మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

మత విభేదాలతో ఏ దేశం అభివృద్ధి చెందదు



ప్రసంగిస్తున్న ఆచార్య శామ్యూల్, వేదికపైన అధికారులు

పెదకాకాని, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఏ దేశంలోనైనా మత విభేదాలు ఉన్నట్లయితే ఆ దేశం అభివృద్ధికి దూరంగా ఉండటంతోపాటు దేశ అభివృద్ధి కూడా జరగదని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని సెంటర్ ఫర్ డాక్టర్ అంబేడ్కర్ చైర్ పూర్వ విభాగాధిపతి ఆచార్య నాలాది శామ్యూల్ అన్నారు. విభాగం ఆధ్వర్యంలో రెండు రోజులుగా అంబేడ్కర్ విజన్ ఆన్ ఇంటర్నే ఆఫ్ సోషియో పొలిటికల్ ఎకనామిక్ ఫ్యాక్టర్స్ ఇన్ ఇండియా అనే యూజీసీ జాతీయ సదస్సు శనివారం ముగిసింది. ముగింపు కార్యక్రమంలో పరిశోధకులను, అధ్యాపకులను ఉద్దేశించి ఆచార్య శామ్యూల్ మాట్లాడుతూ ప్రస్తుతం చాలా దేశాలు మతాన్ని ఆధారంగా చేసుకొని యుద్ధాలు చేస్తున్నాయనీ, మరికొన్ని దేశాలు అభివృద్ధికి నోచుకోని స్థితిలో ఉన్నాయంటే అక్కడ అంబేడ్కర్ వంటి మహానుభావులు రాసిన రాజ్యాంగం లేకపోవడమే కారణమన్నారు. నేటి యువత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అంబేడ్కర్ చైర్ విభాగాధిపతి ఆచార్య వై.అశోక్ కుమార్ మాట్లాడుతూ సదస్సుకు 40 పరిశోధన పత్రాలు వచ్చాయనీ, వాటిల్లో ముఖ్యమైన అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు వివరించారు. భారతి దాసన్ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ వెంకటాచలం, డాక్టర్ మద్దూ అంకయ్య, డాక్టర్ భవాని, డాక్టర్ లావణ్య, బాబు జగ్జీవన్‌రామ్ చైర్ డైరెక్టర్ ఆచార్య వీజే రత్నాకర్ ప్రసంగించారు. సదస్సులో విద్యా విభాగం అధ్యాపకులు డాక్టర్ ఎం.వసంతరావు ప్లీనరీ సెషన్ నిర్వహించారు. అంబేడ్కర్ చైర్ అసిస్టెంట్ ప్రొఫెసర్, సదస్సు కోశాధికారి డాక్టర్ కె.అబ్రహం లింకన్, విభాగం సిబ్బంది డాక్టర్ వి.శ్రీనివాస్, ఎన్.అబ్రహం, పరిశోధకులు జె.అనిల్ కుమార్ బి.కోటి యాదవ్, రంగనాథ్, రత్న శేఖర్, అనురాధ పాల్గొన్నారు.

ఎక్సైజ్ శాఖ నూతన కార్యవర్గం ఎన్నిక



నూతనంగా ఎన్నికైన జిల్లా ఎక్సైజ్ శాఖ ఎగ్జిక్యూటివ్ కార్యవర్గం

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసులో అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలుగా గుంటూరు టూ టౌన్ సీఐ ఎం.యశోదరా దేవి ఎన్నికయ్యారు. శనివారం నగరంలోని ఒక ప్రైవేటు హోటల్లో జరిగిన అసోసియేషన్ ఎన్నికలలో ఆమె అత్యధిక ఓట్ల మెజార్టీతో జిల్లా అధ్యక్షురాలుగా గెలుపొందారు. యశోదరా దేవిపై పోటీ చేసిన సత్తెనపల్లి సీఐ విజయ్ కుమార్‌కు స్వల్ప ఓట్లు మాత్రమే వచ్చాయి. జిల్లా వ్యాప్తంగా యశోదరాదేవికి అధికారులు మద్దతు పలికి భారీ మెజార్టీతో గెలిపించారు.

అధ్యక్షురాలిగా యశోదరా దేవి..

అధ్యక్షురాలుగా ఎం.యశోదరా దేవి, అసోసియేటెడ్ ప్రెసిడెంట్‌గా ఎస్వీ సుబ్బారావు (ఎస్సై, నాగార్జునసాగర్ చెక్ పోస్ట్), వైస్ ప్రెసిడెంట్‌గా కె.కర్ణ (సీఐ పిడుగురాళ్ల), ప్రధాన కార్యదర్శిగా పీఆర్‌కే మూర్తి (ఎస్సై- గుంటూరు-2), ఆర్గనైజింగ్ కార్యదర్శిగా జి. వీరాంజనేయులు (సీఐ మంగళగిరి), ట్రెజరర్‌గా (కృష్ణారెడ్డి), ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా డి.శ్రీనివాసరావు (సీఐ వినుకొండ), ఎం.శ్రీరాం ప్రసాద్ (సీఐ నగరం), ఆర్ తారా లక్ష్మి(ఎస్సై, నరసరావుపేట), టి.ఫణి కుమార్ (సీఐ తెనాలి). నూతనంగా ఎన్నికైన కమిటీని ఉన్నతాధికారులు ప్రత్యేకంగా అభినందించారు.

రైతులు నేరుగా రైతుబజార్లకు రావొచ్చు

గుంటూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో టమాట, కూరగాయలు పండిస్తున్న రైతులకు అండగా నిలిచేందుకు మార్కెటింగ్ శాఖ సిద్ధమైంది. రైతులు దళారుల బారినపడి తమ పంటను తక్కువ ధరకు అమ్ముకొని నష్టపోకుండా ఉండేందుకు సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు పంట ఉత్పత్తుల విక్రయానికి రైతుబజార్లలో అవకాశం కల్పించనున్నట్లు ఆ శాఖ ప్రకటించింది. ఇప్పటికే నారాకోడూరు పరిసర ప్రాంతాల్లో టమాట పండిస్తున్న రైతులతో మాట్లాడి వారి వద్ద నేరుగా టమాటలను కొనుగోలు చేసినట్లు మార్కెటింగ్ శాఖ గుంటూరు జిల్లా ఏడీ బి. రాజబాబు తెలిపారు. టమాటాలే కాకుండా క్యాలీఫ్లవర్, క్యాబేజీ వంటి కూరగాయలను రైతులు నేరుగా రైతుబజార్లకు తీసుకొచ్చి విక్రయించుకోవచ్చని సూచించారు. రైతుబజార్ల ద్వారా అమ్ముకొనేందుకు గుంటూరు నగరంలోని కృష్ణనగర్ రైతుబజార్ ఎస్టేట్ అధికారి నంబరు. 9182361301ని సంప్రదించాలని సూచించారు. అలానే సమీపంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీల సెక్రెటరీలను సంప్రదించినా పంట ఉత్పత్తులు విక్రయించుకోవడానికి ప్లాట్‌ఫాం ఏర్పాటు చేస్తామన్నారు. టమాట రైతులు రైతుబజార్లలో కేజీ రూ.13 చొప్పున విక్రయించుకోవచ్చని సూచించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.65
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	87, 99,108
చికెన్ విత్ స్కిన్	172.00
చికెన్ స్కిన్ లెస్	182.00

పులిచింతల సమాచారం

అచ్చంపేట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో శనివారం 30.76 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి వెయ్యి క్యూసెక్కులు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద లీకుల ద్వారా మూడు వందల క్యూసెక్కులు దిగువకు విడుదల అవుతుంది.

ఆదాయం తక్కువ.. ఖర్చు ఎక్కువ

- పాలనకు సతమతమవుతున్న యంత్రాంగం
- వైసీపీ హయాంలో బిల్లులు చెల్లించని వైనం
- కుప్పలుగా పేరుకుపోయిన అప్పులు
- తలలు పట్టుకుంటున్న మున్సిపల్ అధికారులు

పిడుగురాళ్ళ, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ల పురపాలక సంఘానికి వచ్చే రాబడి కన్నా బకాయిల చెల్లింపులే ఎక్కువగా ఉండటంతో పరిపాలన సాగించేందుకు అధికారులు సతమతమవుతున్నారు. 2019 నుంచి 2024 మధ్య వైసీపీ హయాంలో మున్సిపాల్టీకి సంబంధించి బిల్లుల చెల్లింపుతో పాటు విద్యుత్ బిల్లు, వ్యాట్ టాక్స్‌తో పాటు మరికొన్ని చెల్లింపులను జరుపకపోవడంతో ఇప్పుడు అవన్నీ చెల్లించేందుకు అధికారులు తలమునకలవుతున్నారు. 'ఆదాయం మూరెడు.. ఖర్చు బారెడు' అన్న చందంలా పిడుగురాళ్ల మున్సిపాల్టీ పరిస్థితి తయారైంది.

గత ఐదేళ్లలో మంచినీటి పథకానికి సంబంధించి విద్యుత్ బిల్లు సుమారు రూ.15 కోట్లు, వీధి దీపాల ఖర్చు 2.63 కోట్లు, పురపాలక సంఘం పరిధిలో చేసిన వివిధ పనుల తాలూకు సుమారు ఐదున్నర కోట్లు, వ్యాట్, రిటర్న్స్‌కు రూ.35 లక్షలకు పైగా, ఇతర ఖర్చులకు సుమారు మరో రూ.30 లక్షలకు పైగా చెల్లింపులు చేయాల్సి వుంది. పనులు చేసిన కాంట్రాక్టర్లు గత ఐదేళ్ల పనులు చేసిన సమయంలో బిల్లుల చెల్లింపుకు తిరిగి తిరిగి కాళ్లు అరిగాయే తప్ప చెల్లింపులు మాత్రం జరుపకపోవడంతో వారంతా ఇప్పుడు



పాత బకాయిలు చెల్లించాలంటూ అధికారులను కోరుతున్నారు. పురపాలక సంఘానికి హౌస్ టాక్స్ రూపేణ మూడున్నర కోట్లు, వ్యాపార, పెనాల్టీలు, గృహనిర్మాణాలు, ఆక్రమణల ఫండ్ ద్వారా మరో రూ.2 కోట్లు మాత్రమే మున్సిపాల్టీకి రాబడి వుంది. కార్యాలయాల్లో ఔట్ సోర్సింగ్ జీతభత్యాలు, బిల్లుల చెల్లింపులు, ఇతరత్రా ఖర్చులు కలుపుకుంటే రాబడి కన్నా మరో రెండు రెట్లు ఎక్కువే కనిపిస్తుంది. గృహ, వ్యాపార సంబంధిత పన్ను మాత్రమే వసూలవుతుండగా ప్రభుత్వ భవనాలకు సంబంధించి ఆస్తి పన్ను ఎన్నో ఏళ్లగా లక్షల రూపాయలు కొద్దీ బకాయిలు వున్నా వాటిని రాబట్టేందుకు మున్సిపల్ సిబ్బంది చేయని ప్రయత్నమే లేదు. అయినప్పటికీ ఆయా శాఖల నుంచి ఏళ్ల తరబడి రూపాయి కూడా మున్సిపాల్టీకి జమ కావడం లేదు. దీంతో వచ్చే కొద్దో గొప్పో ఆదాయం ఖర్చులు, చెల్లింపులకే సరిపోతుండటంతో అధికారులు ఏమి చెయ్యాలో పాలుపోక తలమునకలవుతున్నారు.

మున్సిపాల్టీకి ప్రభుత్వ శాఖల నుంచి రావాల్సిన బకాయిలు ఇవే ...

రైల్వే శాఖ నుంచి సుమారు రూ.25 లక్షలు, ఆర్అండ్‌బీ శాఖ నుంచి రూ.10.5 లక్షలు, ఎంపీడీవో కార్యాలయం నుంచి సుమారు రూ.5 లక్షలు, తహసీల్దార్ కార్యాలయం నుంచి సుమారు రూ.10 లక్షలు, పోలీస్ స్టేషన్ నుంచి రూ.6.5 లక్షలు, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల నుంచి సుమారు రూ.4 లక్షలు, ఎస్ఎస్‌పి కార్యాలయాలు నుంచి సుమారు రూ.4.25 లక్షలు, స్త్రీ శిశు సంక్షేమ బాల సదనం నుంచి రూ.6.20 లక్షలు బకాయిలు వున్నాయి. ఇవి కొన్నేళ్లుగా పేరుకుపోతున్నాయే తప్ప చెల్లింపులు మాత్రం జరుపటం లేదు.

నేడు విద్యుత్ బిల్లుల చెల్లింపునకు ఈఆర్‌వో కౌంటర్

మాచర్లటౌన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో ఆదివారం పట్టణ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు విద్యుత్ బిల్లుల చెల్లింపునకు ఈఆర్‌వో కౌంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు కోటేశ్వరరావు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలి

మాచర్ల రూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి డీఎస్సీ నోటిఫికేషన్ వెంటనే విడుదల చేయాలని సీపీఐ మాచర్ల ఏరియా కార్యదర్శి మేకల పోతుల శ్రీనివాసరెడ్డి, ఏఐవైఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి నర్రా రంగస్వామిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని సీపీఐ కామెర వీరస్వామి భవన్‌లో ఏఐవైఎఫ్ నేతలు సమావేశం నిర్వహించారు. అనంతరం తహసీల్దారు కార్యాలయంనకు వెళ్లి తహసీల్దార్ కిరణ్‌కుమార్ వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మిద్దెపోగు బాబురావు, కాశ శివయ్య, అబ్రహం లింకన్, అప్పారావ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రైతులతో ఆర్డీవో సమావేశం

నకరికల్లు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : గోదావరి, పెన్నా నదుల అనుసంధానంలో భాగంగా పోలవరం, పనకచర్ల ప్రాజెక్టు కింద పంపు హౌస్‌ల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పంపుల హౌస్‌ల నిర్మాణానికి మండలంలోని నరసింగపాడు గ్రామంలో 78 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉంది. పంపు హౌస్, సబ్ స్టేషన్ నిర్మాణానికి ప్రభుత్వం భూమిని సేకరిస్తున్న రైతులతో ఆర్డీవో జీవీ రమణకాంత్‌రెడ్డి, తహసీల్దార్ పుల్లారావు నరసింగపాడు సచివాలయంలో సమావేశం నిర్వహించారు. ఎకరానికి ప్రభుత్వ నిబంధనలు అనుసరించి రూ 15 లక్షల నుంచి రూ 18 లక్షలు వరకు పరిహారం అందించే అవకాశం ఉందని ఆర్డీవో తెలిపారు. ప్రభుత్వం ఇచ్చే ఈ పరిహారం తమకు ఆమోదం యోగ్యం కాదని, ఎకరానికి రూ.50 లక్షలు పరిహారం ఇచ్చే విధంగా చూడాలన్నారు. తాము కోరిన పరిహారం ఇవ్వక పోతే తాము భూములను ఇవ్వబోమని, ఆందోళన చేస్తామన్నారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్తానని ఆర్డీవో రైతులకు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ కే పుల్లారావు, జలవనరుల శాఖ ఏఈఈలు ప్రమీల, సౌజన్య, చల్లా శ్రీను, రైతులు, వీఆర్‌వో మౌలాలి పాల్గొన్నారు.

నేడు స్కాలర్‌షిప్ టెస్టు

పిడుగురాళ్ళ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పల్నాడు ప్రాంతంలోని ప్రతిభావంతులైన పదవ తరగతి విద్యార్థులకు విట్ కళాశాల నరసరావుపేట, గుంటూరు వారి ఆధ్వర్యంలో ఆదివారం వాసవి కల్యాణ మండపంలో స్కాలర్‌షిప్ టెస్టును నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మధ్యాహ్నం 2నుంచి 4 గంటల వరకు పరీక్ష జరు గుతుందని, ప్రతిభావంతులకు మొదటి బహుమతి రూ. 10 వేలు, 2వ బహుమతి రూ.5 వేలు, 3వ బహుమతి (ఇద్దరికి) రూ. 2,500 చొప్పున అందజేస్తామని శ్రీనివాసరెడ్డి తెలిపారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

- ఆర్థో సర్జన్ డాక్టర్ గురవారెడ్డి

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఆరోగ్యం ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని డాక్టర్ గురవారెడ్డి సూచించారు. తుమ్మలచెరువు గ్రామంలో శనివారం సర్వేజన ఫౌండేషన్ ఆధ్వర్యంలో మల్టీ స్పెషాలిటీ వైద్యశిబిరం నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ఆర్థో సర్జన్ డాక్టర్ గురవారెడ్డి హాజరై 350మందికి వైద్యపరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందజేశారు. వైద్యశిబిరంలో డాక్టర్ ఆదర్శ్‌రెడ్డి, పలువురు వైద్యులు పాల్గొన్నారు.

యాసిన్, రషీద్‌లకు సన్మానం

కారంపూడి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): కారంపూడి పట్టణానికి చెందిన షేక్ మొహమ్మద్ యాసిన్, మండలంలోని పెదకొదమగుండ్లకు చెందిన షేక్ అబ్దుల్ రషీద్‌లు ముస్లిం బాషలో ముఫ్తి కోర్సులను పూర్తి చేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని మర్కస్ మసీదులో అంజుమన్ కమిటి ఆధ్వర్యాన వారిని దుశ్శాలువలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో షేక్ బుడేసా, మోదీన్‌సా, నూరు, తండా జానీబాషా, సయ్యద్ సుభాని, యాసిన్ పాల్గొన్నారు.

గ్రామంలో వ్యర్థాల తొలగింపు

ముప్పాళ్ళ ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చాగంటివారిపాలెంలో శనివారం పారిశుధ్య కార్యక్రమాన్ని చేపట్టారు. రోడ్లవెంబడి చెత్తను తొలగించి ఘనవ్యర్థాల సేకరణ కేంద్రానికి తరలించారు. ఊర చెరువు గట్టుపై వేసిన దిబ్బలను జేసీబీతో దిబ్బలను తొలగించారు. కార్యక్రమంలో సర్పంచ్ పీలా గాయత్రీ లక్ష్మణ్, ఈవోపీఆర్డీ శింగమనేని రూపవతి , పంచాయితీ కార్యదర్శి శివపార్వతి తదితరులు పాల్గొన్నారు.

జాతర ప్రారంభం

బెల్లంకొండ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాచాయపాలెం గ్రామంలో శనివారం నుంచి పోలేరమ్మ జాతరను ప్రారంభించినట్టు ఆలయ కమిటీ పేర్కొంది. శనివారం సాయంత్రం అమ్మవారి ఊరేగింపు, ఆదివారం సాంస్కృతిక కార్యక్రమాలు, సోమవారం జాతర ముగింపు కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు.

పెన్షనర్ల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- మాచర్ల ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి



ఎమ్మెల్సీ ఎన్నికల కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

మాచర్లటౌన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లడుతూ గత వైసీపీ ప్రభుత్వం పెన్షనర్లను అనేక ఇబ్బందుకు గురి చేసిందని, నేడు రాష్ట్ర ఆర్థికవ్యవస్థను కూటమి ప్రభుత్వం గాడిన పెడుతోందని, ఎన్ని ఇబ్బందులున్నప్పటికీ సమయానికి పెన్షనర్లకు నగదు జమ చేస్తుందన్నారు. రాష్ట్రాభివృద్ధిలో పెన్షన్‌దారులు భాగస్వాములు కావాలని కోరారు. ఈనెల 27న జరగనున్న పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించాలని కోరారు. కరపత్రాలను పంపిణీచేశారు. కార్యక్రమంలో గాదె రామకృష్ణారావు, నందా నరసింహయ్య, చంద్రయ్య మాష్టర్,గాలీబు, కూటమి నేతలు పాల్గొన్నారు.

కన్నెగంటి పోరాటం స్ఫూర్తిదాయకం

దుర్గి, (ఆంధ్రజ్యోతి): పుల్లరి వ్యతిరేక ఉద్యమ నేత, స్వాతంత్ర్య సమరయోధుడు కన్నెగంటి హనుమంతు పోరాటం స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. కన్నెగంటి 103 వర్ధంతిని పురస్కరించుకొని శనివారం దుర్గిలోని కన్నెగంటి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ యేచూరి సునీతాశంకర్, కురియాల ఉదయ్‌భాస్కర్, మారాసు కృష్ణ, బ్యంగా వెంకటేశ్వర్లు, పులి హరి, తోటకూర శ్రీను, బూసా రామాంజినేయులు, తోటకూర శ్రీనివాసరావు, రుద్రాల రవి నేతలు పలువురు పాల్గొన్నారు.

6వ తరగతిలో ప్రవేశానికి

దరఖాస్తులు ఆహ్వానం

దాచేపల్లి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి) : ఏపీ మోడల్ స్కూల్లో 6వ తరగతిలో చేరేందుకు మార్చి 31వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు దాచేపల్లి మోడల్‌స్కూలు ప్రిన్సిపాల్ రవికుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.150, ఎస్సీ, ఎస్టీలు రూ.75 దరఖాస్తు రుసుం చెల్లించాల్సి ఉంటుందని, ఏప్రిల్ 20న ప్రవేశ పరీక్ష జరుగుతుందని తెలిపారు.

దుర్గి,(ఆంధ్రజ్యోతి): ఏపీ మోడల్ స్కూల్లో 6వ తరగతి ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బాలస్వామి తెలిపారు. ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపుపొందిన స్కూల్లో ఐదో తరగతి చదివి, ప్రమోషన్ పొంది ఉండాలన్నారు. వివరాలకు సెల్: 9160649929, 9440726818లను సంప్రదించాలన్నారు.

గురజాలటౌన్, (ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లెగుంత మోడల్ స్కూల్లో ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఉషశ్రీ తెలిపారు. ఏప్రిల్ 20న ప్రవేశపరీక్ష నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రవేశం కోరే విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు నమోదు చేసుకోవాలన్నారు.

చెత్త సేకరణపై అవగాహన

అమరావతి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి) మండల పరిధిలోని లెమల్లె, ఉంగుటూరు గ్రామాల్లో శనివారం ఎంపీడీవో టి.శివపార్వతి, పంచాయితీ కార్యదర్శి బి.రమేష్‌లు పర్యటించి ప్రతి ఇంటి నుంచి సేకరించే తడి, పొడి చెత్త గురించి మహిళలకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామాలలో కొన్ని నెలలుగా పేరుకుపోయిన చెత్తదిబ్బలను ఎక్స్‌వేటర్‌తో తొలగింపచేశారు. రహదారుల వెంబడి ఎవరైన వ్యర్థాలు వేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డ్వాక్రా మహిళలు, హరిత సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఎన్ఆర్ఈజీఎస్ పై ప్రజా వేదిక

- పాల్గొన్న డ్వామా పీడీ సిద్ధ లింగమూర్తి

అచ్చంపేట, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): అచ్చంపేట మండల పరిషత్ కార్యాయలంలో శనివారం ఎన్ఆర్ ఈజీఎస్‌పై ప్రజావేదిక నిర్వహించారు. డ్వామా పీడీ సిద్ధ లింగమూర్తి 2023 - 24 ఆర్థిక సంవత్సరంలో చేసిన రూ.8,68,48,955 పనుల గురించి వివరించారు. 1238 పనులకు గాను రూ.7,22,91,036 , పంచాయతీ రాజ్‌లో 25 పనులకుగాను రూ.1,45,57,919లకు ప్రజా వేదిక జరిగింది. ఈ సందర్భంగా రూ.65,522 రికవరీ చేయాలని పీడీ ఆదేశించారు. తాడువాయి, చెరుకుంపాలెంగ్రామాల్లోని పనులకు అత్యధికంగా రూ.18,500 పెనాల్టీలు విధించారు. కార్యక్రమంలో ఏపీడీ పీవీ నారాయణ, ఎంపీడీవో కె.శ్రీనివాసరావు, ఏపీవో సీహెచ్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



పోలింగ్ కేంద్రాల పరిశీలనలో ఆర్డీవో మురళీకృష్ణ

పోలింగ్ కేంద్రాల పరిశీలన

గురజాలటౌన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా పట్టణంలోని గాంధీ బొమ్మ సెంటర్‌లో ఎంపీపీ హిందూ స్కూల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను శనివారం ఆర్డీవో మురళీకృష్ణ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పోలింగ్‌బూత్‌ల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేస్తున్నట్లు చెప్పారు. పట్టణంలో 830, మండలపరిధిలో 667 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఆయన వెంట కమిషనర్ శివన్నారాయణ, తహసీల్దార్ నగేష్, సీఐ భాస్కర్ ఉన్నారు.


ఏరియా వైద్యశాలలో అన్నదానం

సత్తెనపల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : డొక్కా సీతమ్మ అన్న ప్రసాద వితరణలో భాగంగా శనివారం ఏరియా వైద్యశాలలో జనసేన నేతలు అప్పాపురపు నరేంద్ర ఆధ్వర్యంలో వి.బృందావని ఆర్థిక సహకారంతో 120 మందికి భోజనం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పోతుగంటి రామకోటేశ్వరరావు, నరసింహారావు, అప్పారావు, కోటేశ్వరరావు, శ్రీరామమూర్తి, లక్ష్మయ్య, బంగారు పాప తదితరులు పాల్గొన్నారు. అన్న ప్రసాద వితరణకు న్యాయవాది బొక్కా సంగీతరావు కూడా రూ.3,300 ఆర్థికసాయం అందజేశారు.

గ్రామాల్లో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర

మాచవరం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలం లోని అన్ని గ్రామాల్లో శనివారం ఉదయం 6 గంటల నుంచి పారిశుధ్య సిబ్బంది వ్యర్థాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఎంపీడీవో వెంగళరావు పిన్నెల్లి, మాచవరం, వేమవరం గ్రామాల్లో జరుగుతున్న వ్యర్థాల సేకరణ కార్యక్రమాన్ని స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా క్లాప్ మిత్రలకు, పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. ప్రతి ఇంటి నుంచి సేకరించిన వ్యర్థాలను ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సంపద తయారీ కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ప్రతిరోజు చేపట్టాలని పేర్కొన్నారు. కార్యక్రమం నిర్వాహణలో ఎవరైనా అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసకుంటామని హెచ్చరించారు. కార్యక్రమాల్లో ఆయాగ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ అధికారులు, సిబ్బంది, క్లాప్ మిత్రలు పాల్గొన్నారు.

ఎద్దుల బీడు భూములను సంరక్షించండి



ఎద్దుల బీడులో మాట్లాడుతున్న గ్రామస్థులు

దాచేపల్లి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి) : అన్యాక్రాంతమైన ఎద్దుల బీడు భూమిని అక్రమార్కుల చెరనుంచి విడిపించాలని పలువురు రైతులు డిమాండ్ చేశారు. శనివారం దాచేపల్లి మండలం పొందుగుల గ్రామానికి చెందిన రైతులు ఎద్దుల బీడులో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టీడీపీ నేత రెహ్మాన్ మాట్లాడుతూ పశువుల మేత కోసం గ్రామస్థులకు ఉమ్మడి ఆస్తిగా ఉన్న 200 ఎకరాల భూమిని వైసీపీ ప్రభుత్వ హయాంలో కొందరు అక్రమార్కులు అన్యాక్రాంతం చేశారని ఆరోపించారు. బీడు భూములను పంట భూములుగా చూపుతూ ఆన్ లైన్‌లో నమోదు చేయించి, ఆయాపత్రాలను బ్యాంకుల్లో తనఖా పెట్టి లోన్లు పొందారని ఆరోపించారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు దృష్టికి తీసుకు వెళ్లామన్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు విచారణ జరిపి తప్పుడు నమోదులను తొలగించాలని, అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో గార్లపాటి రెహ్మాన్, తండాజానీ, నాదెండ్ల సైదులు, నార్ల కాశయ్య, సయ్యద్ హుస్సేన్, తండా బాలెసైదా, అబ్దుల్ రెహ్మాన్ పాల్గొన్నారు.



మౌలానా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కన్నా

అబుల్‌కలాంకు నివాళి

సత్తెనపల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : భారత తొలి విద్యాశాఖ మంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు మౌలానా అబుల్‌కలాం అజాద్ వర్ధంతిని శనివారం టీడీపీ ప్రజా వేదికలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎమ్మెల్యే కన్నా మౌలానా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అబ్దుల్‌నబీ, తురగ మేరీ గ్రేస్, సయ్యద్ పెద కరిముల్లా, బుడే, జానీ ఖాజావలి, మక్కపాటి రామచంద్రరరావు, బత్తుల నాగేశ్వరరావు, కోమటినేని శ్రీనివాసరావు, సయ్యద్ మాబూ పాల్గొన్నారు. వైసీపీ కార్యాలయంలోనూ మౌలానా అబుల్ కలాం అజాద్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఎమ్మెల్యే కన్నాకు అగ్రిగోల్డ్ బాధితుల వినతి

అసెంబ్లీ సమావేశాల్లో అగ్రిగోల్డ్ బాధితులకు బడ్జెట్‌లో నిధులు కేటాయించేలా చూడాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కేతినేని అగస్టీన్, సహాయ కార్యదర్శి కరిముల్లా, నియోజకవర్గ అధ్యక్షులు ఆకుల శ్రీనివాసరావు శనివారం సత్తెనపల్లిలో ఎమ్మెల్యే కన్నాను కలసి వినతిపత్రం అందించారు.

ఆక్రమణలు తొలగించాలి

సత్తెనపల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గార్లపాడురోడ్డు సమీపం వద్ద పాత గ్రంథాలయ స్థలంలో ఆక్రమణలను తక్షణమే తొలగించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సుబ్బరత్నమ్మ ఆదేశించారు. శనివారం ఆమె గ్రామంలోని గ్రంథాలయ స్థలాన్ని పరిశీలించారు. స్థలంలో ఫెన్సింగ్ వేసి ఉండటాన్ని గమనించి గ్రంథాలయ స్థలాన్ని ఆక్రమిస్తే సహించేది లేదని, వెంటనే ఆక్రమణలను తొలగించాలని హెచ్చరించారు. గ్రంథాలయ స్థలాన్ని ఆక్రమిస్తే పోలీసులకు ఫిర్యాదు చేయటంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ విషయంపై గ్రంథాలయ సంస్థ రాష్ట్ర చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు స్పందిస్తూ ఆక్రమణలపై ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణతో ఫోన్‌లో మాట్లాడారు. దీంతో ఆక్రమణదారులను వెంటనే ఖాళీ చేయించేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కన్నా ఆదేశించారని తెలిపారు.

ఆయుష్ వైద్యశిబిరం

బెల్లంకొండ, ఫిబ్రవరి22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగిరెడ్డిపాలెంలో గ్రామంలో శనివారం ఆయుష్ వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్టు డాక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమకాటుతో సంక్రమించే వ్యాధులు, నివారణ చర్యల గురించి స్థానికులకు వివరించినట్లు తెలిపారు. అనంతరం 110 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి ఆయుష్ మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రమణ, ఏఎన్ఎం కోటేశ్వరమ్మ, అంజలి, ఆయుష్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కబడ్డీ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

జిలాస్థాయి క్రీడా పోటీలు ప్రారంభం

పెదకూరపాడు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పెదకూరపాడులోని జీఆర్‌సీఆర్‌కే స్పోర్ట్స్ అకాడమీ క్రీడా ప్రాంగణంలో నెహ్రూ యువకేంద్రం సౌజన్యంతో జన చైతన్య సమితి ఆధ్వర్యంలో జిల్లాస్థాయి వాలీబాల్, కబడ్డీ పోటీలను ఉత్తర అమెరికా తెలుగు సంఘం నేషనల్ కో-ఆర్డినేటర్ రామకృష్ణ బాలినేని శనివారం ప్రారంభించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, క్రీడలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. జీఆర్‌సీఆర్‌కే శ్రీచైతన్య స్పోర్ట్స్ అకాడమీ డైరెక్టర్ గుత్తా రాము మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులను ప్రోత్సహించటం కోసమే స్పోర్ట్స్ అకాడమీ ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో జన చైతన్య సమితి కార్యదర్శి తుళ్ళూరి సాంబశివరావు పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్‌కు డ్రోన్ అందజేత

పెదకూరపాడు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లింగంగుంట్ల గ్రామానికి చెందిన మేదరమెట్ల శ్రీనివాసరావు శనివారం పెదకూరపాడు పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ గిరిబాబును కలిసి డ్రోన్ కెమేరాను అందజేశారు. ఈసందర్భంగా శ్రీనివాసరావుని ఎస్ఐ అభినందించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ లింగయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, పక్కన ఆలపాటి

ఆలపాటిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలి

- పిడుగురాళ్లలో ఎమ్మెల్యే యరపతినేని
- కూటమి అభ్యర్థి రాజేంద్రప్రసాద్‌తో కలిసి ఎన్నికల ప్రచారం

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): కృష్ణా - గుంటూరు పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికలలో ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పట్టభద్రులను కోరారు. శనివారంపట్టణంలోని ఎస్టీయూ శాఖ కార్యాలయంలో ఉపాధ్యాయులు, పట్టభద్రులతో ఎమ్మెల్యే యరపతినేని, అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా యరపతినేని మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయవర్గాలకు మేలు చేకూర్చే కూటమి ప్రభుత్వాన్ని బలపరిచేం దుకు ఆలపాటి రాజాను గెలిపించాలని కోరారు

పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా : ఆలపాటి

కృష్ణా - గుంటూరు జిల్లాల పరిధిలో పట్టభద్రుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ తెలిపారు. గత ఐదేళ్ల ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలు ఎన్నో ఇబ్బందులు పడ్డారని, వాటిలో ముఖ్య ప్రాతిపదికన పరిష్కరించే దిశగా తన వంతు కృషి చేస్తానన్నారు. సమావేశంలో ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సాయి శ్రీనివాస్, కార్యదర్శి మల్లు రఘురామిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు రామిరెడ్డి, రామలింగయ్య, మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకటసుబ్బారావు, డాక్టర్ వున్నం నాగమల్లికార్జునరావు, కూటమి నేతలు పలువురు పాల్గొన్నారు.

దాచేపల్లి, (ఆంధ్రజ్యోతి): స్థానిక నారాయణపురంలోని కళ్యాణ మండపంలో జనసేన పార్టీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. నరసరావుపేట పార్లమెంట్ ఎన్నికల సమన్వయకర్త, జనసేనపార్టీ రాష్ట్ర నేత వడ్రాణం మార్కండేయ బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఆలపాటి రాజేంద్ర ప్రసాదును గెలిపించటమే లక్ష్యంగా జనసేన పార్టీ శ్రేణులు పని చేయాలని కోరారు. సమావేశంలో కటకం అంకారావు,అంబటి మల్లి, బడిదల శ్రీనివాసరావు, మండల పార్టీ కన్వీనర్ పాముల కిషోర్, కోట మధు పాల్గొన్నారు.

బెల్లంకొండ, (ఆంధ్రజ్యోతి) : స్థానిక టీడీపీ కార్యాలయంలో రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్ మండల టీడీపీ నేతలతో సమావేశం ఏర్పాటు చేశారు. పార్టీ శ్రేణులు గ్రామాల్లోని పట్ట భద్రులను కలిసి ఆలపాటి రాజేంద్ర ప్రసాదుకు ఓటు వేసే విధంగా కృషి చేయాలని కోరారు. సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, సర్పంచ్ జ్యోతి సముద్రం, నేతలు పలువురు పాల్గొన్నారు.



సత్తెనపల్లి చైతన్య స్కూల్లో ఎన్నికల కరపత్రాలను పంపిణీ చేసిన ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి, (ఆంధ్రజ్యోతి) : కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాదు విజయాన్ని కాంక్షిస్తూ శనివారం పట్టణంలోని చైతన్య స్కూల్, హోలీ ఫ్యామిలీ పాఠశాలలో స్థానిక నేతలతో కలిసి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఆలపాటి రాజేంద్ర ప్రసాదుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఆయనతో పాటు ఎమ్మెల్సీ ఎన్నికల నియోజకవర్గ పరిశీలకులు వేముల కొండ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ఉన్నారు.

నకరికల్లు మండలంలోని నకరికల్లు, నరసింగపాడు, గుండ్లపల్లి గ్రామాల్లో నిర్వహించిన పట్ట భద్రుల ఆత్మీయ సమావేశాల్లో ఎమ్మెల్యే కన్నా పాల్గొన్నారు.

దుర్గి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ముటుకూరులో ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాల్లో మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులను కలిసి మొదటి ప్రాధాన్యత ఓటును అభ్యర్థించి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ యేచూరి సునీతాశంకర్, దొండపాటి చెన్నయ్య, లింగా బ్రహ్మయ్య, తోటకూర శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ముటుకూరులో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

మాచవరం, (ఆంధ్రజ్యోతి) : గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు కుమారుడు యరపతినేని నిఖిల్ శనివారం కొత్త గణేషునిపాడు, పిల్లుట్ల, మోర్జంపాడు, మాచవరం, పిన్నెల్లి గ్రామాల్లోని పాఠశాలల ఉపాధ్యాయులను, సచివాలయ సిబ్బందిని కలసి ఆలపాటి రాజాకు ఓటు వేయాలని ప్రచారం నిర్వహించారు. ఆయన వెంట సీఆర్ రాజన్, కల్లం రాజశేఖరరెడ్డి, కూటమి నేతలు ఉన్నారు.

అచ్చంపేట, (ఆంధ్రజ్యోతి) : అచ్చంపేట టౌన్ పార్టీ కో-ఆర్డినేటర్లతో టీడీపీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం సమావేశం నిర్వహించారు. ఆలపాటి రాజాను అత్యధిక ఓట్లతో గెలిపించే దానిలో భాగంగా మండలంలోని కో-ఆర్డినేటలందరూ పని చేయాలని అన్నారు.

క్రోసూరు, (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాదును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ టీడీపీ నేతలు శనివారం పట్ట భద్రులను కలిసి అభ్యర్థించారు. మండలంలోని పెరికపాడులో కో-ఆర్డినేటర్లు గ్రాడ్యుయేట్‌లను కలిసి ఆలపాటిని గెలిపించాలని కోరారు.

పెదకూరపాడు, (ఆంధ్రజ్యోతి): మండలంలోని కన్నెగుండ్ల, గారపాడు గ్రామాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు కేకే చౌదరి పట్టభద్రులను కలిసి ఆలపాటి రాజేంద్ర ప్రసాదుకు వేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు అర్తిమళ్ళ రమేష్, గంగాధర్,అంజనేయులు, అప్పారావు, షేక్ ముంతాజ్ తదితరులు పాల్గొన్నారు.


ఆనందం.. ఆకర్షణీయం!

● నెమళ్ల నృత్యం.. చెంగు చెంగున జింకలు ● ఆహ్లాదంగా నగరవనాలు
● యాత్రికులకు ఫిదా చేస్తున్న పర్యాటక కేంద్రం



ఘాట్ రోడ్డులో విష్ణుమూర్తి విగ్రహం

(కోటప్పకొండ/నరసరావుపేట, ఆంధ్రజ్యోతి) కోటప్పకొండ ఘాట్ రోడ్డులోని పర్యాటక కేంద్రం యాత్రికులను ఫిదా చేస్తుంది. యాత్రికులకు నయనానందాన్ని కలిగిస్తుంది. తిరునాళ్లకు పర్యాటక కేంద్రాన్ని ముస్తాబు చేస్తున్నారు. ఉద్యానవనాలు, వన్య ప్రాణులతో శోభిల్లుతుంది. చిన్నారుల ఆటలు, ఆనందం కోసం పిల్లల రాజ్యం పార్కును ఏర్పాటు చేశారు. రంగు రంగుల చేపలతో నీటి కొలను, అక్వేరియంలు ఆకట్టుకుంటు న్నాయి. శ్వేత నెమలి నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. నెమలి వనంలో నెమళ్ల నృత్యాలు కనువిందు చేస్తున్నాయి. లవ్ బర్డ్స్, రామ చిలుకలు, పావు రాళ్లు, ఎర్రకాళ్ల కొంగలు, బాతులు, ట్రాయ్ ట్రెయిన్, నీటి పక్షులు, జింకలు, కణుతులు, మనుబోతులు, దుప్పులు, వివిధ రకాల విదేశీ పక్షులు యాత్రికులను ఆకట్టుకుంటున్నాయి. కాళింది మడుగులో బోట్ షికారు కల్పిస్తున్నారు. పర్యాటక కేంద్రాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. అటవీ శాఖ ఘాట్ రోడ్డుకు ఇరువైపులా పెంచిన పూల మొక్కలు ఆకట్టుకుంటున్నాయి. కోటప్పకొండ పెట్లూరివారి పాలెం మార్గంలో, గిరి ప్రదక్షిణ మార్గంలో నగరవనాలు యాత్రికులను ఆకట్టుకుంటున్నాయి. ఘాట్ రోడ్డు మార్గంలో చతుర్ముఖ బ్రహ్మ, శేష శయనంపై విష్ణుమూర్తి, కాళింది మడుగులో తాండవ కృష్ణుడు విగ్రహాలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి.







పర్యాటక కేంద్రంలో నెమలి నృత్యం

ఆకట్టుకుంటున్న నగర వనాలు

కోటప్పకొండలో ఏర్పాటు చేసిన నగరవనం యాత్రికులను ఆకట్టుకుంటుంది. ఆహ్లాదం.. సాహసం.. వినోదం కలగలిపి నగరవనాలను నిర్మించారు. ఇక్కడి నిర్మాణాలు ఆకట్టుకుంటున్నాయి. తాటి కలపతో నిర్మించిన స్వాగత ద్వారం, గుడిసెలు ఆకర్షిస్తున్నాయి. కోటప్పకొండ గిరి ప్రదక్షిణ మార్గంలో నగరవనం, గిరివన విహార్, గిరి బాల విహార్ పేర్లతో ఉద్యానవనాలు రూపుదిద్దుకున్నాయి. గిరివన విహార్‌లో నాగవల్లి వివిధ మొక్కలను పెంచుతున్నారు. చిన్నారుల కోసం ఆట వస్తులతో ప్రత్యేక పార్కు.. సాహస క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేశారు. పెట్లూరివారిపాలెం - కోటప్పకొండ మార్గంలో నగరవనం రూపుదిద్దుకుంది. కొండ వెనుక ప్రాంతంలో పండ్ల.. పూల మొక్కలతో వనాలను పెంచుతున్నారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో ఈ వనాలు రూపుదిద్దుకున్నాయి. వీటిని కేంద్రీయ నగర వన యోజన పథకం కింద అటవీ శాఖ చేపట్టింది.

గణనీయంగా పెరిగిన జింకల సంఖ్య

పర్యాటక కేంద్రంలో జింకల పార్కును 1999లో నాటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. ప్రారంభంలో 20 దుప్పులు, జింకలతో పార్కును ఏర్పాటు చేశారు. ప్రస్తుతం జింకల సంఖ్య గణనీయంగా పెరిగింది. వీటి సంఖ్య 150కి చేరింది. వన్య ప్రాణుల సంరక్షణలో అటవీ శాఖ అన్ని చర్యలు తీసుకుంటుంది. ఇంకా కృష్ణ జింకలు, మనుబోతులు ఉన్నాయి.

కాళింది మడుగులో కృష్ణుని విగ్రహం



ఘాట్ రోడ్డులో చతుర్ముఖ బ్రహ్మ విగ్రహం

పెట్లూరివారి రహదారిలో నిర్మించిన నగరవనం





అక్వేరియంలో రంగురంగుల చేపలు

నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ

యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించేందుకు..

తుళ్లూరు సీఆర్డీఏకు రూ.40 లక్షల మెటీరియల్ రాక



సీఆర్డీఏ కార్యాలయంలో నైపుణ్యాభివృద్ధి పై శిక్షణ

తుళ్లూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి నిర్మాణానికి భూములివ్వటంతో వ్యవసాయ పనుల్లేక ఉపాధి సన్నగిల్లింది. దీనికితోడు వైసీపీ ప్రభుత్వంలో రాజధాని నిర్మాణ పనులు పూర్తిగా నిలిపేశారు. ఉపాధి కోసం బయట ప్రాంతానికి స్థానికులు వలసపోయారు. దీనిని గమనించిన కూటమి ప్ర భుత్వం రాజధాని 29 గ్రామాలలో అర్హత ఉన్న వారికి వృత్తి నైపుణ్యంలో శిక్షణ ఇవ్వడానికి సిద్ధమైంది. ఫుడ్ ప్రాసెసింగ్, ఎలక్ట్రికల్, ఏసీ మెకానిజం, జ్యూట్ బ్యాగుల తయారి, ల్యాండ్ స్కేపింగ్, టెక్స్ టైల్స్ టైలరింగ్ వంటి రంగాలలో శిక్షణనిచ్చి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించటానికి సీఆర్డీఏ సన్నద్ధమైంది. ఇప్పటికే తుళ్లూరు సీఆర్డీఏ ప్రాంతీయ కార్యాలయంలో ఆయా కోర్సుల్లో శిక్షణను ప్రారంభించారు. శిక్షణకు అ ర్హులైన వారు దరాఖాస్తు చేసుకోవాలని సీఆర్డీఏ సోషల్ వెల్ఫేర్ అధికారి బొర్రా శ్రీనివాసరావు సూచిస్తున్నారు.

ప్రథమ పౌరులుగా గుర్తించి...

రాజధాని 29 గ్రామాలలో 2024 డిసెంబరు 8వ తేదీ లోపు నివాసం ఉంటున్న వారిని గత టీడీపీ ప్రభుత్వం ప్రథమ పౌరులుగా గుర్తించి ఉచిత వైద్య సేవలు అందించటానికి ఆరోగ్యశ్రీ కార్డులే కాకుండా ప్రత్యేక వైద్యం అందించటానికి హెల్త్ కార్డులు జారీ చేసింది. అంతేకాకుండా నైపుణ్యాభివృద్ధిలో శిక్షణనిచ్చి ఉపాధి అవకాశాలు కల్పించింది. రాజధాని మొదటి పౌరులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించటానికి సీఆర్డీఏ చర్యలు తీసుకుంటుంది. రాజధాని నిర్మాణ పనులు నిమిత్తం పలు అంతర్జాతీయ కంపెనీలు అమరావతిలో కొలువు తీరబోతున్నాయి. ఆయా కంపెనీల్లో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడానికి తుళ్లూరు సీఆర్డీఏ ప్రాంతీయ కార్యాలయంలో శిక్షణ ఇస్తున్నారు. అందుకు అవసరమైన రూ.40 లక్షల విలువైన వస్తు సామగ్రి సైగర్ కంపెనీ నుంచి సీఆర్డీఏ కార్యాలయానికి వచ్చాయి.



ఆలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన క్యూలు

నేటి నుంచి వైభవంగా బ్రహ్మోత్సవాలు

పెదకాకాని, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు నేటి నుంచి మార్చి ఒకటి వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో గోగినేని లీలా కుమార్ తెలిపారు. ప్రతిరోజూ స్వామివారికి అమ్మవార్లకు అభిషేకాలు జరిపించనున్నట్లు తెలిపారు. ఈ నెల 26న మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఉదయం 4 గంటల నుంచి 7 గంటల వరకు మాత్రమే గర్భగుడిలో మూలవిరాట్‌కు అభిషేకాలు జరుగుతాయన్నారు. ఆ తర్వాత భక్తులకు స్వామివారి దర్శనం కల్పిస్తామన్నారు. 27న స్వామి, అమ్మవార్ల రథోత్సవం, 28న దేవస్థాన ఉత్తర భాగమున ఉన్న మంచినీటి చెరువులో తెప్పోత్సవం నిర్వహించనున్నట్లు వివరించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటి రోజు ఆదివారం శ్రీమల్లేశ్వర స్వామి వారు భ్రమరాంబ అమ్మవారు పెండ్లి కుమారునిగా, పెండ్లి కుమార్తెగా భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. భక్తులకు ఉచిత అన్నప్రసాద వితరణకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.





ప్రత్యేక అలంకరణలో మల్లేశ్వర స్వామి, భ్రమరాంబ అమ్మవారు

ఉట్టిపడుతున్న ఆధ్యాత్మిక శోభ

అమృతలూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రసిద్ధి చెందిన శైవ క్షేత్రాల్లో ఒకటైన గోవాడ బాలకోటేశ్వరస్వామి ఆలయం దినదినాభివృద్ధి చెందుతుంది. ఎంతో పురాతన ఆలయం. ఫిబ్రవరి 24వ తేదీ నుంచి 28వ తేదీ వరకు ఉత్సవాలు జరగనున్నాయి. దాతల సహకారంతో ఆలయ ప్రాంగణంలో నూతన ఆలయాల ఏర్పాటుతో పాటు రాజగోపురం, అభిషేక మండపం, నూతన మందిరాలు నిర్మించారు. దీంతో ఆలయం వద్ద నూతన శోభ సంతరించుకుంది. ఆలయ ప్రాంగణంలో దక్షిణామూర్తి, మృత్యుంజయస్వామి విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఆలయం చుట్టూ విఘ్నేశ్వర, ప్రసన్నాంజనేయ, సుబ్రహ్మణ్యేశ్వర, సాయిబాబా ఆలయాలను నిర్మించారు. దీంతో ఆలయ ప్రాంగణంలోకి ప్రవేశించగానే ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడుతుంది. మహాశివరాత్రి పర్వదినం రోజున వేలాది సంఖ్యలో భక్తులు స్వామి దర్శనానికి రానున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా క్యూలైన్‌లు పూర్తి చేశారు. దేవస్థానం ఎదుట చలువ పందిళ్లు వేశారు. అభిషేక మండపంలో ఒకేసారి 250 మంది దంపతులు కూర్చొని స్వామివారికి అభిషేకం చేసేలా ఏర్పాటు చేస్తున్నట్లు ఈవో తెలిపారు.



గోవాడ శ్రీబాలకోటేశ్వరస్వామి ఆలయం

◆ హాజరుతో సంబంధం లేకుండా పరీక్ష రాసే అవకాశం
◆ వాట్సాప్ నుంచి హాల్‌టిక్కెట్లు డౌన్‌లోడు చేసుకునే సౌలభ్యం
◆ ప్రతీ కేంద్రంలో సీసీ కెమేరాలతో నిఘా.. గుంటూరు నుంచి పర్యవేక్షణ
◆ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేశామన్న ఇంటర్ బోర్డు ఆర్ఐవో జుబేర్



వివరాలు వెల్లడిస్తున్న ఆర్ఐవో జుబేర్

ప్రిన్సిపాల్ సంతకం లేకున్నా హాజరుకావచ్చు

గుంటూరు (విద్య), ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షలకు జిల్లాలో పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు ఇంటర్ బోర్డు ఆర్ఐవో జుబేర్ తెలిపారు. శనివారం ఇంటర్ బోర్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది తొలిసారిగా ఫీజు కట్టిన ప్రతి విద్యార్థి హాజరుతో సంబంధం లేకుండా పరీక్ష రాసే అవకాశం కల్పించామన్నారు. హాల్‌టిక్కెట్లు వాట్సాప్(95523 00009) నుంచి డౌన్‌లోడు చేసుకోవచ్చన్నారు. వాటిపై ప్రిన్సిపాల్ సంతకం లేకున్నా సరే నేరుగా పరీక్షకు హాజరుకావచ్చని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, పరీక్షలు జరిగే సమయంలో కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. పరీక్షలపై సందేహాలు, ఫిర్యాదుల కోసం కార్యాలయంలో ప్రత్యేసెల్ (0863-2228528) అందుబాటులోకి తెచ్చామన్నారు. మార్చి 1 నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయన్నారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు పరీక్ష ఉంటుందని, కేంద్రాల్లోకి 8.30 కల్లా అనుతిస్తామన్నారు. 9 గంటల తర్వాత ఒక్క నిమిషం అలస్యమైనా కేంద్రాల్లోకి అనుతించమన్నారు.

జిల్లాకు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినర్‌గా ఎస్‌వీ సుబ్బారావు, పరీక్షల ప్రత్యేక అధికారిగా డీవీఈవో పద్మను ప్రభుత్వం నియమించిందన్నారు. పరీక్షల నిర్వహణపై ఇప్పటికే చీఫ్ సూపరింటెండెంట్స్, డిపార్టుమెంట్ ఆఫీసర్లతో సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. పరీక్షల కోసం విస్తృత ఏర్పాట్లు చేయడంతో పాటు ప్రశాంత వాతావరణంలో విద్యార్థులు పరీక్షలు రాసేలా ఏర్పాట్లు చేయాలని కేంద్రాల నిర్వాహకులకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఈ ఏడాది ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలకు 34,273 మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 34,973 మంది, మొదటి సంవత్సరం వృత్తి విద్యా కోర్సుల పరీక్షలకు 1215 మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 867 మంది చొప్పున మొత్తం 71,528 మంది విద్యార్థులు పరీక్ష హాజరుకానున్నట్లు తెలిపారు. ఇందుకోసం 81 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఆయా కేంద్రాల్లో సీసీ కెమేరాలతో నిఘా ఏర్పాటు చేశామన్నారు. సీసీ కెమేరాల ద్వారా పరీక్షల్ని పర్యవేక్షించడానికి గుంటూరులోని ఇంటర్ బోర్డు, విజయవాడలోని ఇంటర్ బోర్డు ప్రధాన కార్యాలయం నుంచి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రశ్నపత్రాల కోసం 16 స్టోరేజ్ కేంద్రాలు(పోలీసు స్టేషన్స్) ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షల పర్యవేక్షణ కోసం 83 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, మరో 83 మంది డిపార్టుమెంట్ ఆఫీసర్లను ప్రభుత్వం నియమించినట్లు తెలిపారు. ఈ నెల 24 నుంచి స్టోరేజ్ కేంద్రాల నుంచి పరీక్షా కేంద్రాలకు ప్రశ్నపత్రాలు తరలిస్తామన్నారు.

ఉన్నత పాఠశాలల్లో

స్కౌట్స్, గైడ్స్ యూనిట్లు

❖ పీఎంశ్రీ పథకంలో 600 పాఠశాలల ఎంపిక ❖ రూ.3 కోట్లు నిధులు విడుదల

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్, జిల్లా పరిషత్ ఉన్న త పాఠశాలల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్లను సిద్ధం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పీఎంశ్రీ పథకంలో రాష్ట్రం నుంచి 600 పాఠశాలల్లో అమలు చేసేందుకు రూ.3 కోట్లు నిధులు విడుదల చేశారు. ఒక్కో పాఠశాలకు రూ.50 వేలు తొలి విడత అందించారు. ప్రతి పాఠశాల నుంచి ఒక పురుష, ఒక మహిళా ఉపాధ్యాయులకు ఏడు రోజుల బేసిక్ కోర్సు శిక్షణ ఇస్తున్నారు. తాడికొండలోని రెసిడెన్షియల్ స్కూల్‌లోని రీజనల్ ట్రైనింగ్ సెంటర్‌లో ఇప్పటికే మూడు బ్యాచ్‌లకు శిక్షణ పూర్తి చేశారు. యూనిఫాం కోసం రూ. 30 వేలు, శిక్షణ కోసం రూ. 20 వేలు వినియోగిస్తున్నారు. ప్రతి పాఠశాలలో 16 మంది బాలురు, 16 మంది బాలికలను ఎంపిక చేసి స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ ఇవ్వాల్సి ఉంది. రానున్న విద్యా సంవత్సరం నుంచి ఆయా పాఠశాలల్లో యూనిట్లు ప్రారంభం కానున్నాయి. తొలి దశలో ఉపాధ్యాయుల ఎంపిక, శిక్షణ, ఒక్కో పాఠశాల నుంచి నలుగురు విద్యార్థుల ఎంపిక, శిక్షణ పూ ర్తి చేస్తారు. వీరంతా 32 మంది విద్యార్థులకు స్కౌట్ శిక్షణ అందిస్తారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ, దేశభక్తి, విలువలు, మంచి పౌరునిగా ఎదగడం, ప్రథమ చికిత్స, లీడర్‌షిప్, సమాజం పట్ల అవగాహన, సామాజిక సేవా భావాలను పెంపొందించేందుకుగానూ కేంద్ర ప్రభుత్వం స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రవేశ పెట్టింది.



తాడికొండలో స్కౌట్స్ శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయ బృందం

ఆసక్తి చూపని ఉపాధ్యాయులు...

స్కౌట్స్ శిక్షణ పొందేందుకు పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఆసక్తి చూపడం లేదు. దీంతో కేంద్ర ప్రభుత్వం ఆశించిన మేర పాఠశాలల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్లు ఏర్పాటు అయ్యేలా కనిపించడం లేదు. ప్రతి పాఠశాల నుంచి ఒక పురుష, ఒక మహిళ ఉపాధ్యాయురాలు బేసిక్ శిక్షణ పొంది విద్యార్థులను సిద్ధం చేయాల్సి ఉంటుంది. దీనికి ఆసక్తి ఉన్న ఉపాధ్యాయులు ముందుకు రావాలని చెప్పడంతో అధికభాగం పాఠశాలల్లో ఉపాధ్యాయులు శిక్షణ పొందేందుకు ముందుకు రావడం లేదు. యువ ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ అదనపు భారంగా భావించి ఆసక్తి చూపడం లేదు. దీనిపై ప్రభుత్వం విధి విధానాలను రూపొందించి పాఠశాలల్లో ఉన్న వారిలో యువ ఉపాధ్యాయులను తప్పనిసరి చేసేలా ఆదేశాలు ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితరులు

కోటప్పకొండ తిరునాళ్ళ పనుల పరిశీలన

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): నరసరావుపేట మండలం కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి మహాశివరాత్రి పనులను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు శనివారం పరిశీలించారు. వేగవంతంగా పనులు పూర్తిచేయాలని తిరునాళ్ళకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతిరోజు కూటమి నేతలు, కార్యకర్తలు తిరునాళ్ళ ఏర్పాట్లుచేయడం కోసం ఎంతో కష్టపడుతున్నారని, వారందరి కృషితో పనులు సాగుతున్నాయన్నారు.

భారీ మెజారిటీతో గెలిపించండి

● నరసరావుపేట ఎన్నికల పరిశీలకుడు మన్నవ మోహన కృష్ణ

నరసరావుపేట రూరల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటిని భారీ మెజారిటీతో గెలిపించాలని ఏపీ రాష్ట్ర టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్, నరసరావుపేట ఎన్నికల పరిశీలకుడు మన్నవ మోహనకృష్ణ కోరారు. నరసరావుపేట పట్టణ 3వార్డులో శనివారం ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 8 నెలల్లో అభివృద్ధి అంటే ఏమిటో చూపించిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. వ్యవస్థలన్నీ నిర్వీర్యం చేసిన జగన్ విద్యావంతులకు ఉద్యోగాలు లేకుండా చేశారన్నారు. ప్రతిభావంతులు, మేధావులు అందరూ కూటమి అభ్యర్థికి మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని కోరారు.

ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తున్నారు



సమావేశంలో మాట్లాడుతున్న పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి లక్ష్మణరావు

పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి లక్ష్మణరావు

వినుకొండటౌన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో ప్రభుత్వం ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించిందని, త్వరలో జరగనున్న బడ్జెట్ సమావేశాల్లో గవర్నర్ ప్రసంగంపై పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి లక్ష్మణరావు తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేశారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాజకీయ పార్టీల నాయకులు పోటీ చేయడాన్ని ఖండించారు. గతంలో 12వ వేతనసంఘం బకాయిలు ప్రకటించలేదని, నవంబరు 6 లోగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తామని నేటికీ ఇవ్వలేదని అన్నారు. కృష్ణా, గుంటూరు జిల్లాల సమస్యలపై చట్టసభల్లో తమ గొంతు వినిపించామన్నారు. కోవిడ్ సమయంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై గత ప్రభుత్వాన్ని ఎందుకు ప్రశ్నించలేదని ప్రశ్నించగా కోవిడ్ సమయంలో ఎన్నో పోరాటాలు చేశామని, వీడియో క్లిపింగ్‌లు కూడా తమ వద్ద ఉన్నాయన్నారు. ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం (ఐలు)జిల్లా నాయకులు మూర్తి, సీపీఐ సీనియర్ నాయకులు లూకా, యూటీఎఫ్ నాయకులు మోహన్‌కుమార్, సంపత్, సుబ్రహ్మణ్యం, ప్రేమ్‌కుమార్, శ్రీనివాస్, బొంకూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులను పరిశీలించిన ఎంఈవో బ్రహ్మేశ్వరరావు

రొంపిచర్ల, ఫిబ్రవరి 22(ఆంధ్రజోతి): మండలంలోని రెడ్డిపాలెం, రొంపిచర్లలోని జెడ్పీ పాఠశాలల్లో అంగన్‌వాడీ వర్కర్లకు జ్ఞానజ్యోతిలో భాగంగా శిక్షణా తరగతులు జరుగుతున్నాయి. రెడ్డిపాలెంలోని శిక్షణా తరగతులను ఎంఈవో బ్రహ్మేశ్వరరావు శనివారం పరిశీలించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలు అంగన్‌వాడీ కేంద్రాల్లో అమలుచేయాలని తెలిపారు. రిసోర్స్‌పర్సన్‌లు హనుమంతరావు, మల్లికార్జునరావు, వెంకటరావు, రామయ్యలు శిక్షణ ఇచ్చారు. సూపర్‌వైజర్లు శశిదేవి, దేవీబాయి పాల్గొన్నారు.

చెత్త సేకరణను పరిశీలించిన ఈవోపీఆర్డీ

మండలంలోని రొంపిచర్ల, విప్పర్ల గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా శనివారం ఇంటింటికి చెత్త సేకరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఈవోపీఆర్డీ సతీష్ పరిశీలించారు. ప్రజలు తడి, పొడి చెత్తలను వేరుగా ఇవ్వాలన్నారు. ఆదివారం కూడా ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు. ప్రజలు చెత్తను సిబ్బందికి అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆయిల్ రీప్యాకింగ్ సంస్థలపై దాడులు

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆయిల్ రీప్యాకింగ్‌కి సంబంధించి 24 వ్యాపారసంస్థలపై దాడి చేసినట్లు పల్నాడు జిల్లా జాయింట్ ఫుడ్ కంట్రోలర్ ఎన్ చంద్రరావు శనివారం తెలిపారు. సదరు సంస్థల నుంచి శాంపిల్స్ తీసి తనిఖీకి పంపించామని, ఆ తనిఖీలలో ఏవైనా అవకతవకలు తేలితే వారిపై చట్ట ప్రకారం కఠినచర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఫుడ్ సేఫ్టీ కమిషనర్ ఆదేశాల శనివారం 4 జిల్లాల నుంచి 8 టీంలను దాడులకు నియమించినట్లు ఆయన తెలిపారు.

కోర్టులో సాంబశివరావు లొంగుబాటు

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త గుండా సాంబశివరావు ఆయన కుమారుడు అనిల్‌తో పాటు శనివారం గుంటూరులోని ఎక్సైజ్ కోర్టులో లొంగిపోయారు. నరసరావుపేటకు చెందిన ప్రముఖ న్యాయవాదులు మేళం శ్రీకృష్ణ, జీనేపల్లి హనుమంతరావుల ఆధ్వర్యంలో వారు శనివారం గుంటూరులోని న్యాయస్థానంలో లొంగిపోయారు. వారికి రిమాండ్ విధిస్తూ న్యాయస్థానం ఆదేశాలు జారీచేసింది.


పట్టణ ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలి

చిలకలూరిపేట, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకుని పట్టణ ప్రజలు మంచినీటిని పొదుపుగా వాడుకోవాలని చిలకలూరిపేట మున్సిపల్ డీఈ అబ్దుల్ రహీం శనివారం కోరారు. వార్డుల వారీగా నీటి సరఫరాను విభజిస్తున్నట్టు చెప్పారు. మునిసిపాలిటీ పరిధిలో వార్డుల వారీగా ప్రతి ఇంటిలోని మంచినీటి కుళాయిల సర్వే జరుగుతున్నట్టు తెలిపారు. కుళాయి ఉన్న ప్రతిఒక్కరు నీటిఛార్జీలు తప్పక చెల్లించాలని కోరారు.

విద్యార్థులు తల్లిదండ్రులు, కళాశాలకు మంచిపేరు తేవాలి

వాగ్దేవి జూనియర్ కళాశాల వార్షికోత్సవంలో ఎమ్మెల్యే చదలవాడ

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుకొని పెద్దస్థాయికి ఎదిగి తల్లిదండ్రులు, కళాశాలకు, రాష్ట్రానికి మంచిపేరు తేవాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. శనివారం నరసరావుపేటలోని మెగా కన్వెన్షన్ హాల్‌లో వాగ్దేవి జూనియర్ కళాశాల 13వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిధిగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ మాట్లాడారు. డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి కడియాల మాట్లాడుతూ ప్రతిభ అనేది క్రమశిక్షణతో సాధ్యం అవుతుందన్నారు. డాక్టర్ రామాంజనేయులు మాట్లాడుతూ వాగ్దేవిలో చదివి రూర్కేలా ఐఐటీలో డాక్టరేట్ పొంది, ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నామన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఓగూరి నాగేశ్వరరావు, డైరెక్టర్స్ రాయల శ్రీనివాసరావు, కాట్ల రామకోటేశ్వరరావు, కపలవాయి రాజేంద్రప్రసాదు, పాశం కృష్ణారావు, పోటు అచ్చుతరావు, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, పట్టణ అధ్యక్షుడు రంగిశెట్టి రామకృష్ణ, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు శివ, మన్నవ మోహనకృష్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితరులు

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

చంద్రబాబు హామీ.. చకచకా ఇంటి నిర్మాణం



యలమందలలో ఏడుకొండలు ఇంటి నిర్మాణ పనులు

నరసరావుపేట, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నరసరావుపేట మండలం యలమంద పర్యటన సందర్భంగా ఏడుకొండలు అనే వ్యక్తికి ఇంటిని నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు ఏడుకొండలు ఇంటి నిర్మాణపనులు చకచకా సాగుతున్నాయి. రెండు నెలల్లో ఇంటిని పూర్తి చేసేందుకు గృహనిర్మాణ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. డిసెంబరు 31న చంద్రబాబు యలమందలలో పర్యటించారు. ఏడుకొండలు ఇంటికి వెళ్లి అయనకు చంద్రబాబు పింఛన్ అంజేశారు. ఈ సందర్భంగా ఇంటి నిర్మాణానికి నిధులు ఇవ్వాలని చంద్రబాబును ఏడుకొండలు కోరారు. నిధులు మంజూరు చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఈ మేరకు ఇంటిని మంజూరు చేశారు. పాత ఇంటికి కూల్చి కొత్తగా ఇంటి నిర్మాణాన్ని చేపట్టారు. గృహ నిర్మాణశాఖ నుంచి రూ 2.50 లక్షల నిధులు విడుదల చేశారు. టీడీపీ నేతలు రూ 2.50 లక్షలు ఇంటి నిర్మాణానికి సమకూరుస్తున్నారు. మొత్తం రూ 5 లక్షలతో ఏడుకొండలు ఇంటి నిర్మాణపనులు వేగంగా సాగుతున్నాయి. ఏడుకొండలుకు కొత్త ఇల్లు సమకూరుతుండటంతో ఆ కుటుంబం ఆనందోత్సాహాలను వ్యక్తం చేస్తోంది.

ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు కూటమి ప్రభుత్వం కృషి

● వినుకొండ నియోజకవర్గ పరిశీలకుడు పి.భూపతిరరావు

బొల్లాపల్లి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్లటూరు గ్రామంలో ఎంఎల్‌సీ ఎన్నికల ప్రచారంలో వినుకొండ నియోజకవర్గ పరిశీలకుడు పంచుమర్తి భూపతిరావు శనివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు కూటమి ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తుందన్నారు. పట్టభద్రులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, వైద్యులను కలసి ఆలపాటికి మొదటి ప్రాధాన్య ఓటు వేయాలని కోరారు. ఆయన వెంట టీడీపీ నాయకులు పెమ్మసాని నాగేశ్వరరావు, అర్దలపూడి శ్రీనివాసరావు, బేతపూడి వెంకటేశ్వర్లు, బొట్లగుంట నాగేశ్వరరావు, వెలిశెట్టి రంగయ్య, వక్కలగడ్డ కొండలరావు, పల్నాటి వెంకటేశ్వర్లు, గూడూరి ఆదినారాయణ, బొల్లినేని పాపారావు, గూడూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



వెల్లటూరులో ప్రచారం నిర్వహిస్తున్న వినుకొండ నియోజకవర్గ పరిశీలకుడు పంచుమర్తి భూపతిరావు

వరికపూడిశెల ప్రాజెక్టు నిర్మాణ పనులు ప్రారంభించాలి



సమావేశంలో మాట్లాడుతున్న పీడీఎం నాయకులు

వినుకొండ, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): వరికపూడిశెల ప్రాజెక్టు నిర్మాణానికి రానున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశంలో నిధులు కేటాయించి పనులు మొదలుపెట్టాలని ప్రజాసంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో పీడీఎం జిల్లా అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి అధ్యక్షతన శనివారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరికపూడిశెల ప్రాజెక్టు పనులను మొదలుపెట్టి పల్నాడు ప్రాంత ప్రజల దాహార్తితో పాటు సాగునీటి అవసరాలు తీర్చేందుకు ప్రభుత్వం శ్రద్ధ చూపాలన్నారు. పీడీఎం రాష్ట్ర కమిటీసభ్యులు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 70 ఏళ్లకు పైగా దొమ్మర్లగొంది లిఫ్ట్ ఇరిగేషన్ కోసం, వరికపూడిశెల ప్రాజెక్టు కోసం పోరాటాలు సాగిస్తున్నామన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు మూర్తి, లూకా, వైసీపీ నాయకులు ఎం.ఎస్.ప్రసాద్, ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకులు రూబెన్, కాంగ్రెస్ ఇన్‌చార్జి వీరాంజనేయులు, నంగారా భేరి నాయకులు ఆర్. కృష్ణానాయక్, వరికపూడిశెల సంఘం ప్రధానకార్యదర్శి రాంజీనాయక్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు హనుమంతరెడ్డి, రెడ్డిబోయిన ప్రసన్నకుమార్, బొంకూరి వెంకటేశ్వర్లు, శ్రీనునాయక్, ఫిరోజ్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రథమ ప్రాధాన్య ఓటు వేసి గెలిపించండి

● పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు తదితరులు

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు-కృష్ణాజిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో పీడీఎఫ్ అభ్యర్థినైన తనకు మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు కోరారు. శనివారం నరసరావుపేటలోని పల్నాడు విజ్ఞానకేంద్రంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు సంబంధించి 12వ వేతనసంఘాన్ని 2023లోనే నియమించారని, ఇంతవరకు నియామకం జరగలేదన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు రూ.22వేల కోట్ల బకాయిలు రావాల్సివుందన్నారు. నిరుద్యోగులకు సంబంధించి జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని గత ప్రభుత్వం చెప్పింది.. కూటమి ప్రభుత్వం కూడా చెప్పిందన్నారు. ఇంతవరకు విడుదల చేయలేదన్నారు. రాజ్యాంగ లక్ష్యాలకు అనుగుణంగా పీడీఎఫ్ ఎమ్మెల్సీలం పనిచేశామని, ఓటర్లు అందరూ ఆదరించాలని కోరారు. సమావేశంలో యూటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి ఎం మోహనరావు, పీ ప్రేమ్‌కుమార్, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ముజిఫర్ అహమ్మద్, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సుబ్రావమ్మ, కౌలు రైతు సంఘం కామినేని రామారావు, కట్టా కోటేశ్వరరావు, ఈదర గోపిచంద్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా గెలిపిస్తే అండగా ఉంటా

● పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి లక్ష్మణరావు

శావల్యాపురం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): కృష్ణ-గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తొలి ప్రాధాన్య ఓటు వేసి తనను గెలిపిస్తే ఆరేళ్ళపాటు ఉద్యోగులు, నిరుద్యోగులు, యువత అందరికీ అండగా నిలబడతానని పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు తెలిపారు. శావల్యాపురం జడ్పీ పాఠశాలను ఆయన శనివారం సందర్శించి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయులంతా తనకు మద్దతుగా నిలవాలని కోరుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం జ్ఞానజ్యోతి శిక్షణకు హాజరైన అంగనవాడీ కార్యకర్తలను కలసి మద్దతునివ్వాలని కోరారు. యూటీఎఫ్ నేతలు ప్రేమ్‌కుమార్, ప్రసాద్, రామకోటేశ్వరరావు, రవికుమార్, ప్రజాసంఘాల నేతలు కేవీఆర్ మోహన్‌చంద్, బోయపాటి వెంకట్రాయుడు, భువనగిరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విలువలతో కూడిన రాజకీయాలు చేశాం..

చిలకలూరిపేట, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణ-గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలలో పీడీఎఫ్ అభ్యర్థిగా తనను గెలిపించాలని అభ్యర్థి లక్ష్మణరావు శనివారం ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని పెన్షనర్స్ భవనంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తనను గెలిపిస్తే ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, అంగన్వాడి, ఆశావర్కర్లు, నిరుద్యోగుల సమస్యలను చట్టసభలో వినిపించి పరిష్కారం కోసం కృషి చేస్తానని ఆయన చెప్పారు. పీడీఎఫ్ ఎమ్మెల్సీగా తాను చట్టసభలో విలువలతో కూడిన రాజకీయం చేశానని, 2007 నుండి ఇప్పటివరకు ప్రభుత్వం ఏదైనా రాజీ పడకుండా ప్రజా సమస్యల మీద పోరాడామని తెలిపారు. ప్రభుత్వం ఏదైనా నిర్మాణాత్మక ప్రతిపక్షంగా ఉంటామని, ప్రజా సమస్యల పోరాటంలో ముందుంటామని, విమర్శలకు తావు లేకుండా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని వివరించారు.

త్వరితగతిన సమస్యలు పరిష్కరించాలి

● ఎంపీపీ సుహాసిని

శావల్యాపురం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామాల్లోని సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేయాలని ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్‌కుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సుహాసిని అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించారు. జడ్పీటీసీ పారా హైమావతి మాట్లాడుతూ వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని, గ్రామాల్లో చెత్త సేకరణ కేంద్రాలను వినియోగంలోకి తెచ్చి పారిశుధ్యం మెరుగుపరిచేందుకు కృషి చేయాలన్నారు. వైస్ ఎంపీపీలు చెన్నంశెట్టి రంగారావు, నంబూరి ప్రభావతి, ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య పాల్గొన్నారు.

కోడ్ అమలులో ఉన్నా తొలగించని వైసీపీ జెండా



వినుకొండటౌన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని దొండపాడు గ్రామంలో ఎన్నికల కోడ్ అమలు చేయడంలో అధికారులు విఫలమయ్యారు. వారం రోజుల్లో ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో గ్రామం నడిబొడ్డున వైసీపీ జెండాను తొలగించకపోవడంపై స్థానికులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆలపాటికి మద్దతుగా కూటమి నేతల ప్రచారం

చిలకలూరిపేట, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఈనెల 27న జరుగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజాకు ఓటువేయాలని కోరుతూ ఆ పార్టీల నాయకులు శనివారం వివిధ విద్యాసంస్థలను సందర్శించి విస్తృత ప్రచారం చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు తోట రాజారమేష్, తాటిపర్తి జయరామిరెడ్డి, నెల్లూరి సదాశివరావు, మక్కెన నరసింహారావు, ఎస్ఎస్, సుభాని, మద్దుమాల రవి, గోగినేని నాగేశ్వరావు, తూబాటి శ్రీహరి పాల్గొన్నారు. పట్టణంలోని 21వ వార్డు పరిధిలో ఉన్న షరాఫ్‌బజార్, మెయిన్ బజార్ లలో ఆలపాటికి మద్దతుగా వార్డు నాయకులు కనమర్లపూడి రమేష్, ఐటీడీపీ పట్టణ అధ్యక్షుడు అమరా మణికుమార్, కొత్తమాసు శ్రీనివాసరావు, రాచమల్లు సురేష్ ప్రచారం చేశారు.



నూజెండ్లలో గ్రీన్ అంబాసిడర్లు చేస్తున్న పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న ఈవోపీఆర్డీ రబ్బానీ

గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలి

నూజెండ్ల, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో శనివారం సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా నూజెండ్లలో ఈవోపీఆర్డీ ఎస్కే రబ్బానీ చెత్త సేకరణ, పరిసరాల పరిశుభ్రత తదితర పారిశుధ్య పనులను పర్యవేక్షించి సూచనలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ వీర్ల వెంకటస్వామి, కార్యదర్శి వై ప్రభాకర్, టీడీపీ నాయకులు లగడపాటి సూరిబాబు, ఎండ్లూరి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ పోటీలు

ఈపూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఈనెల 24వ తేదీన ముప్పాళ్ళ ధనలక్ష్మీ వ్యాయామ కళాశాల ఆధ్వర్యంలో అంతర కళాశాలల స్త్రీ, పురుషులకు పవర్ లిఫ్టింగ్ పోటీలను నిర్వహిస్తున్నటు ప్రిన్సిపాల్ చుండు వెంకటరావు శనివారం తెలిపారు. ఈ పోటీలలో యూనివర్సిటీ జట్టుకు ఎంపికైన పవర్ లిఫ్టింగ్ క్రీడాకారులు మార్చి 17నుంచి 20వ తేదీ వరకు యూనివర్సిటీ ఆఫ్ కాశ్మీర్ శ్రీనగర్‌లో జరిగే అంతర విశ్వవిద్యాలయాల పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు.

ల్యాబ్ అండ్ ఎక్స్‌రే టెక్నీషియన్స్ సంఘ సమావేశం

చిలకలూరిపేట, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట ల్యాబ్, ఎక్స్‌రే అసోసియేషన్ సభ్యుల కార్యవర్గ సమావేశం పట్టణంలోని సిటీ ల్యాబ్ అండ్ ఎక్స్‌రే సంస్థలో శనివారం జరిగింది.

విద్యుత్ తీగల తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వినుకొండటౌన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో పోస్టుమార్టం రూమ్ వద్ద ప్రమాదకరంగా మారిన విద్యుత్‌తీగలు అనే శీర్షికతో ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన కథనంపై విద్యుత్‌శాఖ అధికారులు స్పం దించారు. ప్రమాదకరంగా మారిన విద్యుత్‌వైర్లను తొలగించి ప్లాస్టిక్ పైపు ద్వారా వైర్లను స్తంభంపై ఏర్పాటుచేయడంతో వైద్యసిబ్బంది, రోగులు ఊపిరి పీల్చుకున్నారు.

ప్రజల సహకారంతోనే సంపద సృష్టి

డీపీవో విజయ భాస్కర్‌రెడ్డి

నాదెండ్ల, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ప్రజల సహకారం ఉంటేనే చెత్త నుంచి సంపదను సృష్టించగలుగుతామని పల్నాడు జిల్లా పంచాయతీ గ్రామీణ అధికారి విజయ భాస్కర్‌రెడ్డి అన్నారు. మండలంలోని నాదెండ్ల, సాతులూరు, తూబాడు గ్రామాల్లో ఆయన శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా సంపద కేంద్రాలను పరిశీలించారు. ఆయా గ్రామాల్లో తడి, పొడి చెత్తలను వేరుచేసే విధానంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రీన్ అంబాసిడర్లకు అందించే తడి, పొడి చెత్తను వేర్వేరుగా ఇవ్వాలన్నారు. అలా చేయటం వల్ల తడిచెత్త నుంచి వానపాముల ఎరువును తయారు చేసి అమ్మటం ద్వారా పంచాయతీలకు సంపదను సృష్టించ గలుగుతామన్నారు. ఈ విషయమై ఇంటింటికి వెళ్ళి ప్రజలకు అవగాహన కల్పించాలని కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి సూచించారు. కాగా ఈవోపీఆర్డీ నిర్మల లక్ష్మీకుమారి సంక్రాంతిపాడు, చిరుమామిళ్ళ, గొరిజవోలు తదితర గ్రామాల్లో పర్యటించి అవగాహన కల్పించారు. ఆయా కార్యక్రమాల్లో కార్యదర్శులు ఎంవీ సుబ్బారావు, రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

6వ తరగతి అడ్మిషన్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

బొల్లాపల్లి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): బొల్లాపల్లి ఆదర్శ పాఠశాలలో 2025-26 సంవత్సరానికి గాను 6వ తరగతి అడ్మిషన్ కొరకు దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని బొల్లాపల్లి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పీ పద్మావతి శనివారం తెలిపారు. 5వ తరగతి చదువుతున్నవారు 6వ తరగతిలో ప్రవేశం కొరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న వారికి ఏప్రిల్ 20, 2025న ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు బొల్లాపల్లి మోడల్ పాఠశాలలో పరీక్ష ఉంటుందని తెలిపారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి 6వ తరగతిలో ప్రవేశం ఉంటుందని, మార్కుల ఆధారంగా సీట్లు ఇవ్వటం జరుగుతుందన్నారు. ఈ పరీక్షకు ఈనెల 24వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని, ఆన్‌లైన్‌లో మార్చి 31వ తేదీ వరకు నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

ఉపాధి హామీ పనులను సకాలంలో చేయించాలి

నూజెండ్ల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనులను సకాలంలో చేయించాలని ఎంపీడీవో పీ ఉమాదేవి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఉపాధి హామీ పనులను గ్రామాల అభివృద్ధికి, రైతులకు ప్రయోజనకరంగా ఉండే విధంగా అనుమతులు పొంది చేయించాలన్నారు. సేద్యపు నీటి కుంటలు, ఇంకుడు గుంతలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీడీవో సూచించారు. కార్యక్రమంలో ఏపీవో ఆంజనేయరాజు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన అధికారులు



వినుకొండ పోలింగ్ కేంద్రంలో సౌకర్యాలను పరిశీలిస్తున్న అధికారులు

వినుకొండటౌన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఈ నెల 27న జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా మున్సిపల్ కమిషనర్, ఎన్నికల అధికారి సుభాష్ చంద్రబోస్, వినుకొండ పట్టణ సీఐ శోభన్‌బాబు, తహసీల్దార్ సురేష్‌లతో కలిసి జూనియర్ కాలేజీలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాన్ని శనివారం పరిశీలించారు. ఓటర్లకు కల్పించిన వసతులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

రైల్వేలైన్ ఏర్పాటుపై మండలిలో ప్రస్తావిస్తా..



రైల్వేలైన్ కోసం ఎమ్మెల్సీ రాజశేఖర్‌కు వినతిపత్రం అందచేస్తున్న చిత్రం

చిలకలూరిపేట, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేటలో రైల్వేలైన్ అవసరమని, ఈ దిశగా రానున్న శాసనమండలి సమావేశాలలో ఈ అంశా న్ని ప్రస్తావించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ శనివారం రైల్వేలైన్ సాధనసమితి కమిటీకి హామీ ఇచ్చారు. సమితి ఆ ధ్వర్యంలో సీపీఐ, ప్రజాసంఘాల నాయకులు రాజశేఖర్‌ను ఆయన నివాసంలో కలిసి రైల్వేలైన్ ఏర్పాటుకు సహకరించాలని కోరారు. ఈ సందర్భం గా మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ రైల్వేలైన్ వల్ల చిలకలూరిపేటతో పాటు పరిసర ప్రాంత ప్రజలకు బహుముఖ ప్రయోజనాలు కలుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో రైల్వేలైన్ సాధన సమితి కన్వీనర్ షేక్ సుభాని, సీపీఐ ఏరియా ఇన్‌చార్జి కార్యదర్శి తాళ్లూరి బాబురావు, మహిళా సమాఖ్య ఏరియా కార్యదర్శి చెరుకుపల్లి నిర్మల, ఎమ్మార్పీఎస్ నాయకులు అడపా మోహన్‌మాదిగ, ముస్లిం సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

28 నుంచి వినుకొండ డివిజన్‌లో వారబందీ అమలు

వినుకొండ, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): వారబందీ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 28వ తేదీన లింగంగుంట సర్కిల్ నందు వినుకొండ డివిజన్ పరిధిలోని కాలువలకు నీటిసరఫరాను ఆపివేసి మార్చి 6 తేదీన కాలువలకు నీరు ఇవ్వనున్నట్లు ఎన్ఎస్‌పీ ఈఈ ప్రేమ్‌కుమార్ శనివారం తెలిపారు. రైతులు నీటిని వృథా చేయకుండా అవసరం మేరకు వాడుకోవాలన్నారు. నాగార్జునసాగర్ రిజర్వాయర్‌లో నీటి నిల్వలు తగ్గినందున కుడికాలువ పరిధిలో వారబందీ అమలుచేస్తున్న అధికారులకు రైతులు సహకరించాలన్నారు.

స్మారక స్థూపం పగులుగొట్టిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలి

వినుకొండ, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): కారంపూడి రోడ్డులోని కళ్యాణపురి కాలనీ ఆర్చీ ఎదురుగా ఉన్న వీరిశెట్టి సీతయ్య స్మారక స్థూపాన్ని పగులుగొట్టిన వ్యక్తులపై కఠినచర్యలు తీసుకోవాలంటూ సీపీఐ నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో పట్టణ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బూదాల శ్రీనివాసరావు, రాము మాట్లాడుతూ వీరిశెట్టి సీతయ్య పంచాయతీ ఉపసర్పంచ్‌గా పనిచేసి, బడుగు, బలహీన వర్గాల కోసం నిరంతరం పోరాడిన గొప్ప వ్యక్తి అన్నారు. ఆయన సతీమణి వీరిశెట్టి గాలెమ్మ కోరిక మేరకు సీపీఐ ఆధ్వర్యంలో సొంత పొలంలో సీతయ్య స్మారక స్థూపం ఏర్పాటు చేశామని, నేడు రియల్టర్లు స్థూపాన్ని పగలుగొట్టి ఆ స్థలాన్ని కోట్లల్లో విక్రయించాలని చూస్తున్నారంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై తనిఖీలు

వినుకొండ, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మార్చి 3వ తేదీ లోపు సింగిల్ యూసేజ్ ప్లాస్టిక్ వాడకం నిషేధించాలంటూ మున్సిపల్ కమిషనర్ సూచన మేరకు పట్టణంలోని ప్లాస్టిక్ హోల్‌సేల్ దుకాణాల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్ షేక్ ఇస్మాయిల్, సిబ్బంది తనిఖీలు చేపట్టారు. 120 మైక్రాన్‌ల కన్నా తక్కువ గల ప్లాస్టిక్‌ను నిషేధించినట్లు చెప్పారు. జూట్ బ్యాగ్‌లు, క్లాత్ బ్యాగ్‌లు ఉపయోగించుకోవాలని సూచించారు. పట్టణ ప్రజలు ప్లాస్టిక్‌ను వాడకుండా పురపాలక సిబ్బందికి సహకరించాలని సూచించారు.